


నెల్లూరు : ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో కుంకుమార్చనలో భక్తులు



నమస్తే.. నమస్తే జగదేక మాతః

నేత్రపర్వం దేవీ నవరాత్రి దర్శనం



నెల్లూరు : ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండరామపురం మహాలక్ష్మికి రూ.12లక్షల కరెన్సీతో ధనలక్ష్మి అలంకారం



రాపూరు : పెంచలకోనలో గజలక్ష్మిగా ఆదిలక్ష్మి



బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడలో రాజరాజేశ్వరిగా కామాక్షితాయి



నెల్లూరు : గజలక్ష్మిగా రాజరాజేశ్వరి

జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరుస్తోంది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తుండటంతో ప్రధాన ఆలయాలు కిటకిటలాడుతు న్నాయి. ఐదోరోజు సోమవారం జగన్మాత ఒక్కో ఆలయంలో ఒక్కో అవతారంలో భక్తులను కటాక్షించింది. అమ్మవారి విశేష అలంకరణలు, ఉత్సవాలు నేత్రపర్వంగా సాగుతున్నాయి. నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారు గజలక్ష్మిగా దర్శనమిచ్చింది. సామూహిక నవావరణ పూజలు, కన్య పూజ జరిగాయి. స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు గాయత్రీ దేవిగా పూజలందుకుంది. సహస్ర దీపాలంకరణ, ముత్యాల చీర అలంకారం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి జ్ఞాన స్వరూపిణి సరస్వతిగా దర్శనమిచ్చింది. చండీ హోమం, అక్షరాభ్యాస కార్యక్రమాలు జరిగాయి. మూలస్థానేశ్వర ఆలయంలోని భువనేశ్వరి అమ్మవారికి రాజరాజేశ్వరి అలంకారం జరిగింది. ఉస్మాన్‌సాహెబ్ పేట కోదండరామపురం మహాలక్ష్మీ అమ్మవారికి రూ.12లక్షలతో ధనలక్ష్మీ అలంకారం వైభవం గా జరిగింది. పెంచలకోనలో ఆదిలక్ష్మి, కావలి కలుగోళ శాంభవి, జొన్నవాడ కామాక్షితాయి, వేదగిరిపై ఆదిలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, పూజలు జరిగాయి.

\- నెల్లూరు (సాంస్కృతికం)



నెల్లూరు : కన్యకాపరమేశ్వరి ఆలయంలో నృత్యం చేస్తున్న యువతి

ఓ వైపు రాజకీయ నేతలు, మరోవైపు నేరస్థులతో అంటకాగుతూ శాంతిభద్రతలు మరిచారన్న అపవాదును పోలీసు శాఖ మూటకట్టుకుంది. ఈ నిందారోపణను తొలగించి, ఆ శాఖను ప్రక్షాళన చేసేందుకు జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ సిద్ధమయ్యారు. అంతకన్నా ముందు స్పెషల్ బ్రాంచ్‌లో ప్రక్షాళన చేసి తన పని మొదలుపెట్టారు. ఏ స్టేషన్‌లో ఎవరు ఎన్నాళ్ల నుంచి పని చేస్తున్నారు? వేరే చోటకు బదిలీ చేసినా మళ్లీ అటాచ్‌మెంట్‌పై ఒకే ప్రాంతానికి ఎందుకు వస్తున్నారు? వీరి పనితీరు ఎలా ఉంది? నేరాలు ఎక్కువ జరుగుతున్న ప్రాంతాల్లో ఎక్కడ వైఫల్యం జరుగుతోంది? తదితర అంశాలను సమీక్షించుకున్న ఎస్పీ అందుకు అనుగుణంగా ప్రక్షాళన మొదలుపెట్టారు.

ఏం జరుగుతోంది.. పోలీస్ శాఖలో ప్రక్షాళన దిశగా ఎస్పీ అడుగులు

ఏం చేస్తున్నారు!?



పలు స్టేషన్లలో పాతుకుపోయిన సిబ్బంది • నేరగాళ్లతో అంటకాగుతున్నట్లు ఫిర్యాదులు

కానిస్టేబుళ్ల పనితీరుపై ప్రత్యేక దృష్టి • రాణాలవారీగా సమీక్ష... వెనువెంటనే బదిలీలు

ఎస్‌బీ ద్వారా ఎప్పటికప్పుడు వివరాల సేకరణ



నెల్లూరు, అక్టోబరు7 (ఆంధ్రజ్యోతి): ఇప్పటికే పలు స్టేషన్లపై సమీక్ష చేసిన ఎస్పీ కృష్ణకాంత్ కఠిన నిర్ణయాలే తీసుకున్నారు. నెల్లూరురూరల్ పోలీసు స్టేషన్ ఇందుకు ఉదాహరణ. ఇటీవల ఏకంగా 9 మంది సిబ్బందిని ఒకేసారి బదిలీ చేయడం జిల్లాలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. అదే క్రమంలో మనుబోలు స్టేషన్‌లో కూడా పలువురిని ఏకకాలంలో బదిలీ చేశారు. జిల్లాలోని అన్ని స్టేషన్లపై సమీక్షిస్తున్న ఎస్పీ అక్కడి పరిస్థితులకు తగ్గట్లుగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. అదే సమయంలో కీలకమైన క్రైం బ్రాంచ్ సిబ్బంది పనితీరును కూడా ఆరా తీస్తున్నారు. రానున్న రోజుల్లో మరికొన్ని స్టేషన్లలో పాతుకుపోయిన సిబ్బందిని బదిలీ చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాస్తవానికి బదిలీలకు ప్రభుత్వం అవకాశమిచ్చినా ఆ సమయంలోపు సిబ్బందిని పనితీరును బేరీజు వేసి బదిలీలు పూర్తి చేయడం సాధ్యం కాలేదు. కొంత ఆలస్యమైనా స్టేషన్ల వారీగా సమీక్షలు నిర్వహించి, సిబ్బందిలో బాధ్యత పెంచే లా ఎస్పీ చర్యలు తీసుకుంటున్నారు.

• ఎస్‌బీలోనూ మార్పులు

వైసీపీ ప్రభుత్వంలో జిల్లాలో శాంతిభద్రతలు ఎలా ఉన్నాయన్న విషయాన్ని ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. అందులోనూ నెల్లూరు నగరంలో ఏ రోజు ఏ ప్రాంతంలో హత్య జరుగుతుందోనన్న భయం ఉండేది. రౌడీషీటర్లు, సస్పెక్ట్ షీటర్లు నాడు రాజకీయ నేతల చుట్టూ తిరుగుతుండటం, వారి జోలికి వెళ్లకుండా పోలీసులను అడ్డుకోవడంతో ఈ ప్రభావం శాంతిభద్రతలపై తీవ్రంగా పడింది. కొంతమంది సిబ్బంది స్టేషన్లలో పని వదిలి రాజకీయ నేతల జపం చేయడం అప్పట్లో తీవ్ర దుమారాన్నే రేపింది. ఆఖరుకు పోలీసు అధికారులు కూడా నాడు ప్రజాప్రతినిధుల చేతుల్లో కీలుబొమ్మల్లా మారారు. ఆ ప్రభావం కూటమి ప్రభుత్వంపై కూడా పడింది. తొలి రెండు నెలల పాటు హత్యలు, దొంగతనాలు ఎక్కువగా జరిగాయి. వీటిని అరికట్టడంలో పోలీసు యంత్రాంగం విఫలమైంది. సిబ్బంది పనితీరులో తీవ్ర నిర్లక్ష్యం ఆవహించడమే ఇందుకు ప్రధాన కారణమని భావించిన ఎస్పీ.. ఆ వెంటనే దిద్దుబాటు చర్యలు మొదలుపెట్టారు. జిల్లాలో ఏ మూల ఏం జరిగినా ఆ విషయాన్ని ఎప్పటికప్పుడు చేరవేయడంలో స్పెషల్ బ్రాంచ్ పాత్ర చాలా కీలకం. గత ప్రభుత్వంలో వైసీపీ నేతలకు ప్రత్యర్థుల సమాచారాన్ని చేరవేసే వ్యవస్థగా మారినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో తొలుత స్పెషల్ బ్రాంచ్‌ను ఎస్పీ ప్రక్షాళన చేశారు. అక్కడ ఉండే పలువురికి స్థాన చలనం కల్పించారు.

• పనితీరుపై నిఘా

పలు స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బందికి నేరస్థులతో సంబంధాలు ఉన్నాయని ఇటీవల ఎస్పీకి ఫిర్యాదులు అందాయి. వాటిని పరిశీలించు కుంటున్న ఆయన.. అవి నిజమని నిర్ధారణ అయితే వెంటనే సదరు సిబ్బందిని దూర ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారు. ఇటీవల ముత్తుకూరు పరిధిలో జరిగిన ఓ భారీ క్రైంలో పట్టుబడిన నేరస్థులతో జిల్లాలోని కొంతమంది సిబ్బందికి సన్నిహిత సంబంధాలు ఉండడంతో వారిపై చర్యలు తీసుకున్నారు. ఇదే క్రమంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మరికొంత మందిపై కూడా అంతర్గత విచారణ జరుగుతున్నట్లు తెలుస్తోంది. కాగా చాలా మంది సిబ్బంది జిల్లా కేంద్రం నుంచి దూర ప్రాంతాల స్టేషన్లకు వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదు. రకరకాల ప్రయత్నాలతో నెల్లూరు నగరం, చుట్టు పక్కల ప్రాంతాల్లోనే ఏళ్ల తరబడి తిష్ట వేసి ఉన్నారు. ఇటువంటి వారిపై కూడా ఎస్పీ దృష్టి పెట్టారు. నిజంగా నెల్లూరులో ఉండడం సదరు సిబ్బందికి అవసరమైతే వారికి దూర ప్రాంతాల్లో పోస్టింగ్‌లు వేసి నెల్లూరుకు అటాచ్‌మెంట్ ఇస్తున్నారు. ఇక దూరప్రాంతాలకు పంపేవారికి పోస్టింగ్ మాత్రం నెల్లూరులో ఇస్తున్నారు. ఇలా చేయడం ద్వారా దూర ప్రాంతాలకు వెళ్లే వారికి ఎక్కువ హెఆర్‌ఏ (ఇంటి అద్దె) వస్తుంది. నెల్లూరు, చుట్టుపక్కల ప్రాంతాలలో అయితే 16 శాతం హెచ్‌ఆర్‌ఏ వస్తుండగా, ఇతర ప్రాంతాల్లో 12 శాతం మాత్రమే ఉంటుంది. ఇలా దూర ప్రాం తాలకు వెళ్లే వారికి నాలుగు శాతం అదనంగా హెచ్‌ఆర్‌ఏ వచ్చేలా చేస్తుండడంతో సిబ్బందికి కూడా ప్రయోజనం చేకూరుతోంది.

అటవీ సంరక్షణపై ప్రత్యేక కార్యాచరణ

• నూతన డీఎఫ్‌వో మహబూబ్ బాషా



రేంజర్లతో సమీక్షిస్తున్న డీఎఫ్‌వో

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : జిల్లాలో అడవుల సంరక్షణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి మహబూబ్ బాషా (ఐఎఫ్‌ఎస్) తెలిపారు. జిల్లా అటవీశాఖ అధికారిగా సోమవారం ఆయన బాధ్యతలు తీసుకుని జిల్లాలో అటవీ స్థితిగతులపై రేంజర్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. వర్షాకాలం కావడంతో జిల్లావ్యాప్తంగా మొక్కలు నాటే ప్రక్రియతోపాటు నగరవనం పనులను త్వరగా పూర్తి చేసేలా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమీక్షలో రేంజర్లు మాల్యాద్రి, రవీంద్రబాబు, శేఖర్, కుమార్‌రాజా, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'సోమశిల'కు పెరిగిన ఇన్‌ఫ్లో

అనంతసాగరం, అక్టోబరు 7 : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి వరద ప్రవాహం పెరిగింది. 14,622 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టులో 52.400 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, దిగువ డెల్టాకు 2,000, కండలేరుకు 8,500, ఉత్తర కాలువకు 540, దక్షిణ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

అవసరాల కంటే రెట్టింపు స్థాయిలో
ఇసుక నిల్వలు

మూడు యార్డులలో 70 వేల టన్నులు • అక్రమ రవాణాకు పాల్పడితే క్రిమినల్ కేసులు

ఫిర్యాదులు, సమాచారానికి టోల్ ఫ్రీం నెంబర్ • 8 మంది ఉద్యోగులతో కో-ఆర్డినేషన్ టీం : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), అక్టోబరు 7 : జిల్లాలో ఇసుక కొరత ఏమాత్రం లేదని, ప్రజల అవసరాలకంటే రెట్టింపుస్థాయిలో నిల్వ ఉన్నట్లు కలెక్టర్ ఆనంద్ స్పష్టం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో కలెక్టర్ విలేకరులతో మాట్లాడుతూ ప్రతిరోజూ 3,500 ఇసుక అవసరం ఉండగా, సుమారు 4,500 టన్నుల ఇసుక ఉత్పత్తి అవుతున్నట్లు తెలిపారు. దీనిని 700 టన్నులకు పెంచేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు. అలాగే జిల్లాలో మూడు యార్డులలో 70 వేల టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. టన్ను ఇసుకను గత ఏడాది కంటే 50 శాతం తక్కువ ధర రూ.350లకే అందిస్తున్నట్లు చెప్పారు. జిల్లాతోపాటు ప్రకాశం, బాపట్ల జిల్లాలకు ఇసుకను అందించనున్నట్లు చెప్పారు. కందుకూరులో మరో యార్డును ప్రారంభిస్తామని చెప్పారు. ఈ నెల 15 తరువాత మినగల్లు, పడమటి కంభంపాడు, పల్లిపాడు, విరువూరులలో ఓపెన్ రీచ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో డీసిల్టేషన్ పాయింట్ల ద్వారా 2,26,198 టన్నులు, సెమీ మెకనైజ్డ్ రీచ్‌ల ద్వారా 13,03,500 టన్నుల, ఓపెన్ రీచ్‌ల ద్వారా 2,86, 500 టన్నులు మొత్తం 18,16,198 టన్నుల ఇసుకను జిల్లావాసులకు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇసుక కోసం దళారులను ఆశ్రయించకుండా, ఏపీ శాండ్ పోర్టల్ ద్వారానే ఇసుకను బుక్ చేసుకోవాలని ప్రజలకు సూచించారు. రవాణా చార్జీలను సిస్టం ద్వారా నిర్ణయిస్తామని, ఆ మేరకు పోర్టల్‌లో అనుసంధానమైన 300పైగా ట్రాన్స్‌పోర్టర్లలో ఎవరైనా ముందుకొచ్చి ఇసుకను సిస్టం నిర్ణయించిన ధరకే రవాణా చేస్తారని చెప్పారు. ప్రజల అవసరాలకు పోను ప్రైవేటు, ప్రభుత్వ భవన నిర్మాణాలకు బల్క్‌గా ఇసుక సరఫరాకు పోర్టల్‌లో 25 శాతం కేటాయించామని, బల్క్ బుకింగ్స్‌ను జాయింట్ కలెక్టర్ పరిశీలించి ఆమోదిస్తారని చెప్పారు. ఇసుక పక్కదారి పట్టకుండా జిల్లా ట్రాన్స్‌పోర్టు కమిటీని నియమించినట్లు చెప్పారు. ఇసుకపై ఫిర్యాదులు, సమాచారం కోసం 0861-2943569 నెంబరుతో టోల్ ఫ్రీ నెంబరు ఏర్పాటు చేశామన్నారు. నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఫెసిలిటేషన్ సెంటర్, హెల్ప్‌డెస్క్, కోఆర్డినేషన్ టీములను 8 మంది సచివాలయ ఉద్యోగులతో ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎస్పీ కృష్ణకాంత్ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాపై గట్టి నిఘా ఉంచామని చెప్పారు. పోలీసు అధికారులతో క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇసుక యార్డులలో సీసీ కెమరాలతో నిఘా ఉంచామని, గుర్తింపు పొందిన వాహనాలను మాత్రమే యార్డులలోకి అనుమతిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటిదాకా 290లకుపైగా వాహనాలను సీజ్ చేసినట్లు వివరించారు.

• ప్రజాప్రతినిధుల అర్జీలను పరిష్కరించాలి

ప్రజా ప్రతినిధుల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆనంద్ హెచ్చరించారు. శంకరన్ హాలులో అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రజాప్రతినిధుల నుంచి వచ్చిన వినతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం చేయదగ్గ పనులను వెంటనే చేపట్టాలని, చేయలేని పనులపై స్పష్టమైన వివరాలతో తెలియచేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్వో లవన్న తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు, కేరళ పర్యటనకు
నగర కమిషనర్ పయనం

నెల్లూరు(సిటీ), అక్టోబరు 7 : ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు ప్రజలకు అందిస్తున్న మున్సిపల్ సేవలను అధ్యయనం చేసేందుకు ఏపీ ప్రభుత్వం నియమించిన కమిషనర్ల బృందంలో నెల్లూరు కమిషనర్ మల్లవరపు సూర్యతేజ ఉన్నారు. ఇందులో భాగంగా ఆయనకు కేటాయించిన తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో పర్యటించేందుకు సోమవారం వెళ్లారు. తాగునీటి సరఫరా, రోడ్ల నిర్వహణ, ఆస్తి పన్ను వసూళ్లు, విధింపు, చెత్త సేకరణ, కాలువల్లో పూడికతీత, డ్రైనేజీ వ్యవస్థ మెరుగు, మరుగుదొడ్ల నిర్వహణ, లైట్లుతో పాటు ఇతర పౌరసేవలు మున్సిపాలిటీల నుంచి ఎలా అందుతున్నాయి, వాటిని ఎలా నిర్వహిస్తున్నారు, తదితర అంశాలను కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ప్రత్యక్షంగా ఐదు రోజుల పాటు అధ్యయనం చేయనున్నారు. పరిశీలించిన అంశాలతో ఏపీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమానికి బెస్ట్ ప్రాక్టీసెస్ అదర్ స్టేట్స్ అంటూ ప్రభుత్వం నామకరణం చేసింది.

టెట్‌కు 177 మంది హాజరు

నెల్లూరు(విద్య): ఏపీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కు సోమవారం జిల్లా వ్యాప్తంగా 177 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఉదయం, సాయంత్రం రామిరెడ్డి సుబ్బరామిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన ఈ పరీక్షకు ఉదయం 110 మంది కి 84 మంది హాజరుకాగా 26 మంది గైర్హాజరయ్యారు. మధ్యా హ్నం సెషన్‌లో 110 మందికి 93 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలను జిల్లా అబ్జర్వర్, రాష్ట్ర ఓపెన్‌స్కూల్ డైరెక్టర్ కే నాగేశ్వర రావు, డీఈవో రామారావు పర్యవేక్షించారు.

పిడుగుపడి వృద్ధుడి మృతి


అనంతసాగరం, అక్టోబరు 7 : మండలంలోని పాతదేవరాయపల్లిలో సోమవారం మధ్యాహ్నం పిడుగు పడి షేక్ ఖాదర్‌బాష (61) మృతి చెందాడు. రోజులాగే సోమవారం వివరాలు గ్రామ సమీపంలో మేకలు మేపుతుండగా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. అదే సమయంలో పిడుగుపడటంతో ఖాదర్‌బాషా అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడికి ముగ్గురు సంతానం కాగా, కుటుంబ పెద్ద మృతితో కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

మద్యం దుకాణాలకు సిండికేట్ ఒత్తిళ్లు

తటపటాయిస్తున్న ఔత్సాహికులు

సిండికేట్ అయితే దోపిడీ తప్పదని మద్యంప్రియుల ఆందోళన

దరఖాస్తు చేయకండి..
నష్టపోతారు!



కందుకూరు, అక్టోబరు 7 : కందుకూరు నియోజకవర్గంలో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసేందుకు ఔత్సాహికులు తటపటాయిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నూతన మద్యం పాలసీని అత్యంత పారదర్శకంగా తీసుకురావడంతోపాటు మద్యం విక్రయాల్లో దోపిడీకి ఆస్కారం లేకుండా పాలసీ ప్రకటించినా కందుకూరులో మాత్రం పరిస్థితులు అందుకు భిన్నంగా కనిపిస్తున్నాయి. కొందరు సీనియర్ మద్యం వ్యాపారులు, అధికార పార్టీలోని కొందరు నేతలు సిండికేట్‌గా మారి మద్యం దుకాణాలన్నీ తమ ఆధీనంలోనే నడిచేలా ప్రణాళిక రచిస్తున్నారు. ఔత్సాహిక దరఖాస్తుదారులను మీరు దరఖాస్తు చేయకండి నష్టపోతారని హెచ్చరికలు చేస్తున్నట్లు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. నియోజకవర్గంలో 17 మద్యం దుకాణాలు ఉండగా ఔత్సాహికులు దరఖాస్తు చేసుకునేందుకు బుధవారం సాయంత్రం వరకు మాత్రమే గడువు ఉంది. సోమవారం సాయంత్రానికి మద్యం దుకాణాలకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన కూడా సిండికేట్ హెచ్చరిక వార్తలు నిజమేనన్న అభిప్రాయం కలుగుతోంది. నియోజకవర్గంలోని 17 దుకాణాలకు శనివారం సాయంత్రం వరకు కేవలం 9 దరఖాస్తులే రాగా సోమవారం సాయంత్రానికి మరో 12 దరఖాస్తులు వచ్చాయి. దీన్నిబట్టి చూస్తే సిండికేట్‌గా మారినట్లు చెబుతున్న వారే ఈ దరఖాస్తులు చేశారని మరికొన్ని దరఖాస్తులు కూడా వారే నమోదు చేసి మొత్తంగా నియోజకవర్గంలోని అన్ని దుకాణాలను కైవసం చేసుకోవడం ద్వారా అధిక ధరలకు మద్యం విక్రయించాలన్న ప్రణాళికతో అడుగులు వేస్తున్నట్లు చెబుతున్నారు. ఒక్కో దుకాణానికి రెండు, మూడు దరఖాస్తులు చొప్పున మొత్తంగా 40 వేస్తే 17 షాపులు తమ వశం అవుతాయని, మిగిలిన 23 దరఖాస్తులకు నాన్ రిఫండబుల్ డిపాజిట్ రూ. 46 లక్షలు పోయినా పెద్ద సమస్య కాదన్న ఆలోచనతో సిండికేట్ వ్యాపారులు ఉన్నారు. నియోజకవర్గంలో దుకాణాలన్నీ ఒకే సిండికేట్ పరిధిలో ఉంటే ఒక్కో మద్యం సీసాకు రూ.10, 20 అదనంగా వసూలు చేయడం పెద్ద సమస్య కాదని, అలా చేస్తే షాపునకు రూ. 3 లక్షల వంతున రూ.50 లక్షలు అదనంగా వసూల్లు చేసుకోవచ్చని భావిస్తున్నారు. అంతేగాక ప్రభుత్వం ఇస్తున్న 20 శాతం మార్జిన్ వల్ల మరో రూ. 50లక్షల వరకు ఆదాయం వస్తుందని తద్వారా నెలకు రూ. కోటి లాభార్జనే లక్ష్యంగా సిండికేట్ అడుగులు వేస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో ఎక్సైజ్ అధికారులు, కలెక్టర్ ఔత్సాహికులకు భరోసా కల్పించగలిగితే భారీగా దరఖాస్తులు నమోదయ్యే అవకాశం ఉంది.

ప్రజల అర్జీలను పెండింగ్ పెట్టొద్దు : ఆర్డీవో

నెల్లూరు (వెంకటేశ్వరపురం), అక్టోబరు 7 : ప్రజల నుంచి వచ్చే అర్జీలను పెండింగ్ లేకుండా వీలైనంత త్వరగా పరిష్కరించాలని కార్యాలయ సిబ్బందిని ఆర్డీవో ఆదేశించారు. సోమవారం నెల్లూరు ఆర్డీవో కార్యలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె ప్రజల నుంచి వచ్చే అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఏవో రాఘవేంద్ర, కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

● నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు ఆర్డీవోగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నాగసంతోష్ అనూషను బీజేపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. పలు అంశాలను ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బైరి శ్రీనివాస్, నెల్లూరు రూరల్ అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ మండ్ల ఈశ్వరయ్య, నాయకులు జనార్దన్, సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లైబ్రేరియన్‌కి జాతీయ అవార్డు

విడవలూరు : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల లైబ్రేరియన్ ఈదూరి కిరణ్‌కుమార్‌కి అప్రిసియేషన్, మెరిటోరియస్ జాతీయ అవార్డును శాలిస్ లైబ్రరీ ఆర్గనైజేషన్ నిర్వాహకులు అందజేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సుజాత సోమవారం తెలిపారు. ఈనెల 4, 5 తేదీల్లో కోయంబత్తూర్‌లోని నిర్మల కాలేజీ, సొసైటీ ఫర్ ది అడ్వాన్స్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ వారు సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు ఈ అవార్డును అందచేశారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులు ఆయన్ను ఘనంగా సన్మానించారు.

క్షయవ్యాధి నివారణ వ్యాక్సిన్ వేయాలి

నెల్లూరు (వైద్యం) : క్షయవ్యాధి నివారణకు ముందుస్తుగా అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ వేయాలని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ ఖాదర్‌వలి వైద్యులు, సిబ్బందికి సూచించారు. సోమవారం నగరంలోని చంద్రమౌళి నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ క్షయ వ్యాధిగ్రస్తులు ఎంతమందిని గుర్తించారు.. ఎంత మందికి పరీక్షలు చేశారు.. వంటి వివరాల రికార్డులను పరిశీలించారు. ఎంత మందికి బీసీజీ వ్యాక్సిన్ వేశారని వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. 60 ఏళ్ల పైబడిన వారికి, క్షయవ్యాధి కుటుంబ సభ్యులకు ఈ వ్యాక్సిన్ వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీ చట్టాలపై అవగాహన

నెల్లూరురూరల్ : పంచాయతీల్లో చట్టాలు, పాలన వ్యవహారాలపై అవగాహన కల్పించేందుకు సోమవారం నెల్లూరురూరల్ మండల పరిషత్ కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న రాష్ట్రస్థాయి పరిశీలకులు రమేష్, ఇన్‌చార్జి ఎంపీడీవో శైలేంద్రకుమార్‌లు మాట్లాడుతూ సర్పంచు, ఉపసర్పంచు, వార్డు సభ్యులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలకు కనీస అవసరాలను తీర్చగలగాలని చెప్పారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఇబ్బందులు రానివ్వకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, సాధారణ పరిపాలన ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలన్నారు.

బాలికపై లైంగిక దాడి

● నిందితుడికి 20ఏళ్ల జైలు, రూ.20వేల జరిమానా

నెల్లూరు (లీగల్), అక్టోబరు 7: తనతో వివాహేతర ఉన్న ఓ మహిళ కుమార్తె (12)పై లైంగిక దాడికి పాల్పడ్డాడనే కేసులో నేరం రుజువు కావడంతో మన్నేపల్లి అలియాస్ తాతలపూడి వెంకటరమణయ్యకు 20ఏళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ. 20వేల జరిమానా విధిస్తూ జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు, బాలిక తల్లి తన భర్తతో విభేదించి నెల్లూరు కరెంట్ ఆఫీస్ సెంటర్‌లో తన కుమార్తెతో కాపురంఉంటూ కూలీ నాలీ చేసుకుని జీవించేది. అదే సమయంలో ఏలూరు జిల్లా కైకలూరు మండలం కనుకొల్లు గ్రామానికి చెందిన వెంకటరమణయ్య కూడా బేల్దారి పని చేస్తూ కరెంట్ అఫీసు సెంటర్‌లో ఉండేవాడు. ఆ సమయంలో వెంకటరమణయ్యకు ఆ మహిళతో వివాహేతర సంబంధం ఏర్పడింది. వారిరువురూ బేల్దారి పనిచేస్తూ జీవనం సాగించేవారు. ఈ నేపథ్యంలో వారు కొడవలూరు మండలం యల్లాయపాళెం గ్రామంలోని ఎన్టీఆర్‌నగర్ కాలనీకి తమ మకాం మార్చారు. అక్కడ 2022 జూలై 31న సదరు మహిళ కుమార్తె (12) తనకు కడుపునొప్పి వస్తుందని చెప్పింది. ఏమయిందని తల్లి ఆరా తీయగా, గత ఆరు నెలలుగా వెంకట రమణయ్య అందరూ నిద్రపోయాక తనను పక్కనున్న గదిలోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడేవాడని తెలిపింది. విషయం బయటకు చెప్తే నిన్ను, నీ తల్లిని చంపివేస్తానని బెదిరించినట్టు బాలిక తన తల్లికి చెప్పింది. దాంతో అమె వెంటనే కొడవలూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా జైలుశిక్షతోపాటు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పోక్సో కోర్టు స్పెషల్ పీపీ డీ శైలజారెడ్డి వాదించారు.

పదిరోజులకు మృతుడి ఆచూకీ లభ్యం



మనుబోలు, అక్టోబరు 7: గతనెల 28న వీరంపల్లి క్రాస్‌రోడ్డు వద్ద మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి ఆచూకీని పదిరోజులకు పోలీసులు కనుగొన్నారు. మృతుడు నెల్లూరు ధనలక్ష్మీపురానికి చెందిన మావిళ్ల విష్ణువర్ధన్ రెడ్డి(31)గా గుర్తించారు. మృతుడు, అతడి భార్య ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. గతంలో మృతుడికి బ్రెయిన్‌స్ట్రోక్ రావడంతో మూడు సార్లు శస్త్రచికిత్స చేశారు. పత్రికల్లో వచ్చిన వార్తల ఆధారంగా భార్య శ్రావ్యారెడ్డి విషయం తెలుసుకుని సోమవారం మనుబోలు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. మానసికస్థితి సరిగాలేక విష్ణువర్ధన్‌రెడ్డి నెల్లూరు నుంచి తిరుపతికి వెళ్లి వస్తుంటాడని, ఏ కారణంతో తన భర్త చనిపోయాడో తెలియదని ఆమె కన్నీరుమున్నీరుగా విలపించారు. కాగా మృతుడికి ఓ కుమారుడు ఉన్నాడు.

పాతకక్షలతో దాడికి యత్నం

నెల్లూరు(క్రైం), అక్టోబరు 7: పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తిపై దాడికి యత్నించిన ఘటనలో చిన్నబజారు పోలీసులు నిందితులపై కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. మూలాపేట హిమాలయ సెంటర్‌కు చెందిన సుబ్రహ్మణ్యం కొత్తూరు నిర్మలానగర్‌లో రేషన్‌షాపు నిర్వహిస్తున్నారు. షాపు విషయమై ఆయనకు సునీల్ అనే వ్యక్తితో మనస్పర్థలున్నాయి. ఈనెల 5వ తేది రాత్రి సుబ్రహ్మణ్యం కొండదిబ్బలో ఓ ఫంక్షన్‌కు వెళ్లారు. అర్ధరాత్రి తన స్నేహితుడు ప్రదీప్‌తో మాట్లాడుతుండగా సునీల్ తన స్నేహితులైన సద్దాం, హేమంత్‌లతో కలిసి అక్కడకు వచ్చి సుబ్రమణ్యంపై కత్తితో దాడి చేసేందుకు యత్నించగా ప్రదీప్ అడ్డుకున్నారు. ఫంక్షన్‌లోని వారు సర్దిచెప్పడంతో కొద్దిసేపటికి నిందితులు అక్కడ నుంచి పరారయ్యారు. బాధితుడు సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు విచారిస్తున్నారు.

మతిస్థిమితం లేని మహిళపై లైంగిక దాడియత్నంపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 7: మతిస్థిమితం లేని మహిళపై లైంగిక దాడికి యత్నం చేసిన నిందితుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ఆనం వెంకటరెడ్డి మున్సిపల్ క్వార్టర్స్‌లో ఓ కుటుంబం నివాసం ఉంటోంది. ఆమెకు వరసకు పెద్దమ్మ అయిన ఓ మహిళకు మతిస్థిమితం సరిగా లేకపోవడం, సొంత ఇళ్లు లేకపోవడంతో అప్పుడప్పుడు బంధువు వద్దకు వచ్చి వెళ్లేది. గత నెల 27వ తేది తెల్లవారుజామున అదే వీధిలోని ఓ అరుగు మీద కూర్చుని ఉండగా పాతమున్సిపల్ ఆఫీసు ప్రాంతానికి చెందిన సాయిచంద్ అటుగా వెళుతూ మతిస్థిమితం లేని మహిళపై లైగింక దాడికి యత్నించాడు. ఈ మేరకు బాధితురాలి బంధువు సోమవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్తను హత్య చేసిన భార్య అరెస్టు

నెల్లూరు(క్రైం), అక్టోబరు 7: కుమారుడిని కాపాడుకునే క్రమంలో భర్తను హత్య చేసిన భార్యను చిన్నబజారు పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. నగరంలోని మెక్లిన్స్‌రోడ్డులో సుభాని(48), కౌసర్‌బేగం దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి ముజాజ్, సోను, ఇలియాజ్‌లు సంతానం. ఈనెల 3వ తేది అర్ధరాత్రి సుభాని పూటుగా మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్యతో గొడవ పడుతుండగా పెద్ద కుమారుడు ముజాజ్ అడ్డుకున్నాడు. దీంతో సుభాని వంటింట్లో నుంచి రోకలిబండ తీసుకువచ్చి కుమారుడుపై దాడికి యత్నించగా భార్య అడ్డుపడి బలవంతంగా రోకలిబండను లాక్కొంది. అక్కడితో ఆగకుండా సుభాని మరోమారు వంటింట్లోకి వెళ్లి కత్తి తీసుకువచ్చి కుమారుడును పొడుస్తుండగా కౌసర్ భర్త తలపై రోకలిబండతో బలంగా కొట్టింది. దీంతో సుభాని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి చిన్నకుమారుడు ఇలియాజ్ ఫిర్యాదు మేరకు చిన్నబజారు పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. సోమవారం కౌసర్ బేగంను చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు అరెస్ట్ చేశారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బ్రాయిలర్ లైవ్	134
లేయర్ లైవ్	110
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264
లేయర్	187

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.7313
వెండి కిలో ధర	రూ. 95,000
వెండి ఒక గ్రాము	రూ. 98.00

ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), అక్టోబరు 7 : డిసెంబరు 8వ తేదీన జరగనున్న నేషనల్ మీన్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించిన పరీక్షకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డీఈవో రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పరీక్షల సంచాలకుల వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు డాట్ బీఎస్ఈ డాట్ ఏపీ డాట్ జీవోవీ డాట్ ఇన్ సైట్ పాఠశాలల లాగిన్‌లో ఈనెల 15వ తేదీ లోపల దరఖాస్తు చేసుకుని స్కూల్ నామినల్ రోల్‌ను, ఎస్‌బీఐ రిసిప్ట్‌ను నగరంలోని దర్గామిట్ట జడ్పీ పాఠశాలలోని జిల్లా పరీక్షల విభాగం కార్యాలయంలో ఈనెల 17వ తేదీ లోపల సమర్పించాలని తెలిపారు.

మానవీయ కోణంలో ఆలోచించండి

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ ఆనంద్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 7: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుంచి వివిధ సమస్యల పరిష్కారం కోసం వచ్చిన అర్జీలను మానవీయ కోణంలో ఆలోచించి పరిష్కరించాలని కలెక్టర్ ఓ ఆనంద్ సూచించారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవన్‌లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని అర్జీలు స్వీక రించారు. వీటిని నిర్దిష్ట గడువులోగా పరిష్క రించాలని సంబంధిత అధికారులను ఆదేశించా రు. మొత్తం 264 అర్జీలు రాగా అందులో రెవె న్యూకు సంబంధించి 126 అర్జీలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో డీఆర్వో లవన్న పాల్గొన్నారు.

● ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

సుప్రీం కోర్టు తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని కోరుతూ సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య, నాయకులు కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు.

● గుజరాజ్‌లోని సోమనాథ్‌లో మసీదులు, ముసాఫిర్ ఖానాలు, గరీబ్ షా దర్గాను కూల్చేసిన స్థానిక కలెక్టర్, ఎస్పీలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ముస్లిం ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు మొహ్మద్ జియాఉల్ హక్ వినతిపత్రం సమర్పించారు.

దళిత, గిరిజన సంక్షేమ పథకాలు కొనసాగించాలి

గత ప్రభుత్వం రద్దు చేసిన దళిత, గిరిజన సంక్షేమ పథకాలను పునరుద్ధరించాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మల్లి కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట దళిత సంఘర్షణ సమితి ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 100 రోజులు దాటుతున్నప్పటికీ సంక్షేమ పథకాల గురించి మాట్లాడటం లేదన్నారు. గతంలో చంద్రన్న ప్రభుత్వం ఉన్నప్పుడు భూమి కొనుగోలు పథకం, కళ్యాణమిత్ర ద్వారా లక్ష రూపాయలు ఇచ్చారన్నారు. నిరుద్యోగులకు వాహన సౌకర్యం కల్పించారన్నారు. వరికోత మిషన్లు, భూమి అభివృద్ధికి రుణాలు మంజూరు చేశారన్నారు. మళ్లీ చంద్రన్న ప్రభుత్వం వచ్చిందని, ఈ పథకాలను అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జాలాది శ్రీనివాసులు, పీ.శివయ్య, కోవూరు దాసు, చలంచర్ల మణి, కత్తి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కోవూరు షుగర్ ఫ్యాక్టరీని పునరుద్ధరించాలి



మాట్లాడుతున్న సీపీఎం, రైతు సంఘాల నేతలు

నెల్లూరు(వైద్యం) : కోవూరు చక్కెర కర్మాగారాన్ని పునరుద్ధరించి రైతులకు అందుబటులోకి తీసుకు రావాలని సీపీఎం, రైతు సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు పీజీఆర్ఎస్ కార్యక్రమం లో కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ 2019లో వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చి మోసం చేశారని, 2024లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు చక్కెర కార్మాగారాన్ని వినియోగంలోకి తీసుకు వస్తామని చేసిన వాగ్దానాన్ని నెరవేర్చాల న్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గవడవరపు శ్రీనివాసులు, జొన్నలగడ్డ వెంకటరమణ, పుల్లయ్య, పులగండ్ల శ్రీరాములు, మూలి వెంగయ్య, శేషయ్య, బుజ్జయ్య, బిట్రా పెద్దాబ్బయ్య, సురేష్, ప్రసాద్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుపై పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశాలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

'పీజీఆర్ఎస్' ఫిర్యాదులపై స్పందించండి

● ఎస్పీ కృష్ణకాంత్

● పోలీసు గ్రీవెన్స్‌కు 97 అర్జీలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), అక్టోబరు 7: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి సమగ్ర విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేయాలని ఎస్పీ జీ.కృష్ణకాంత్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి 97 మంది తమ ఫిర్యాదులు అందజేశారు. బాధితుల నుంచి ఫిర్యాదులు అందుకున్న ఎస్పీ కృష్ణకాంత్ స్థానిక పోలీసు స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రూరల్ డీఎస్పీ జీ.శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ సీఐ సుబ్బారావు, ఎస్‌బీ-2 సీఐ బీ.శ్రీనివాసరెడ్డి, కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

గుట్టుగా తవ్వేసి అమ్మేస్తున్నారు

ప్రస్తుతం ఇసుకకు ఉన్న డిమాండ్‌ను సంపాదనా మార్గంగా మలుచుకున్న కొందరు అక్రమార్కులు అనధికారికంగా పెన్నా నది పరివాహక ప్రాంతాలను కుళ్ళబొడిచి భారీగా ఇసుకను తరలిస్తున్నారు. రాజకీయ పార్టీలకు అతీతంగా సిండికేట్‌గా ఏర్పడిన ట్రాక్టర్ల యజమానులు పక్కా ప్రణాళికతో పకడ్బందీగా ఈ అక్రమ రవాణా సాగిస్తున్నారు. పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు నిఘా వ్యవస్థను కూడా ఏర్పాటు చేసుకోవడం విశేషం. రోజులో మూడు సమయాల్లో మాత్రమే ఇసుకను తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. రూరల్ పోలీసు స్టేషన్లో కొందరు క్రైం పార్టీ సిబ్బంది అండదండలతో ఈ దందా సాగుతోందన్న ఆరోపణలు గుప్పుమంటున్నాయి.

● పెన్నా నది ఇసుక అక్రమంగా తరలింపు ● పార్టీలకు అతీతంగా అక్రమార్కుల సిండికేట్

● ములుముడి, గొల్లకందుకూరు, సజ్జాపురం నుంచి రవాణా ● పోలీసుల రాకపై ముందస్తు నిఘా

● ఆ మూడు సమయాల్లోనే రవాణా ● క్రైం పార్టీ సిబ్బంది సహకారం!

నెల్లూరు రూరల్, అక్టోబరు 7 : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఇసుక అక్రమ రవాణాకు కళ్లెంవేసింది. అయితే ఉచిత ఇసుక పాలసీ పూర్తిగా అమల్లోకి రాకపోవడంతో ఇసుక కొరత ఏర్పడింది. ఈ ప్రభావం భవన నిర్మాణ రంగంపై పడింది. ఈ నేపథ్యంలో కొందరు ట్రాక్టర్ల యజమానులు రహస్యంగా ఇసుకను విక్రయించేందుకు ప్రణాళిక రచించారు. నెల్లూరు రూరల్లోని ములుముడి గ్రామంలో సిండికేట్‌గా ఏర్పడ్డారు. గ్రామానికి ఆనుకుని ఉన్న పెన్నా నదీ తీరంలో ఇసుకను తవ్వుతున్నారు. అక్కడి నుంచి ఆమంచర్ల మీదుగా పొదలకూరు రోడ్డు మీదకు ఒక మార్గంలో రవాణా సాగిస్తున్నారు. మరో మార్గంలో ఇసుక ట్రాక్టర్లు కొమ్మరపూడి అటవీ ప్రాంతం నుంచి దొంతాలి వద్ద పొదలకూరు రోడ్డెక్కుతున్నాయి. ఈ విధంగా రహస్యంగా తరలిస్తున్న ఇసుకను ట్రాక్టరు రూ.7000కు, సౌత్‌మోపూరు పరిసరాల్లో రూ.4000కు, నెల్లూరులోని కొన్ని ప్రాంతాలకు రూ.6 వేలు, దూరాన్ని బట్టి మరికొన్ని ప్రాంతాలకు రూ. 8వేల నుంచి 10 వేలకు అమ్ముతున్నారు. ఇదేవిధంగా గొల్లకందుకూరు, సజ్జాపురం నుంచి కూడా ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. సమీప ప్రాంతాల్లోనే విక్రయాలు జరుపుతూ ట్రిప్పు ఇసుకకు రూ.4 వేల నుంచి 6 వేల వరకు వసూలు చేస్తున్నారు.

● రోజులో మూడు సమయాల్లోనే...

ఇసుక అక్రమ రవాణా చేసే ట్రాక్టర్ల యజమానులు రోజులో మూడు సమయాలను ఎంచుకున్నారు. అర్ధరాత్రి 1-2 గంటల మధ్య, ఉదయం 7-9, మధ్యాహ్నం 1-2 గంటల మధ్య మాత్రమే ఇసుకను రహస్య ప్రాంతాల ద్వారా గమ్యస్థానాలకు చేర్చుతున్నారు. ఈ సమయా ల్లో పోలీసు నిఘా తక్కువగా ఉంటుందని గ్రహించిన ట్రాక్టర్ల యజమానులు ఆ సమయా ల్లోనే ఇసుకను హద్దులు దాటిస్తున్నారు. దీని వెనుక నిఘా వ్యవస్థ కూడా నడుస్తోంది. పెన్నాలో ఇసుకను లోడ్ చేసుకున్న ట్రాక్టర్లు బయల్దేరిన తరువాత గమ్యం చేరే రూట్లలో ఎస్కార్టుగా ఇద్దరు వ్యక్తులు స్కూటర్లలో ముందు వెళుతుంటారు. ఆ తరువాత ట్రాక్టర్లను పంపుతారు. ఎస్కార్ట్‌కు ఎక్కడైనా పోలీసులు తారసపడితే వెంటనే ట్రాక్టర్ డ్రైవర్లకు సమాచారమిచ్చి జాగ్రత్తపడుతున్నారు. ఇలా ఎర్రచందనం స్మగ్లింగ్ తరహాలో పెన్నా నుంచి ఇసుకను తరలిస్తున్నారు.



పెన్నా తీరం నుంచి రహస్య మార్గంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్

● క్రైం పార్టీ పోలీసుల అండదండలు !

నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్‌లోని కొందరు క్రైం పార్టీకి చెందిన పోలీసులు ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు పోలీసులు ములు ముడి గ్రామంలోని ట్రాక్టర్ యజమానుల సిండికేట్‌తో సంబంధాలు ఏర్పరచుకుని ఇసుక దందాకు అండగా నిలుస్తున్నారన్న విమర్శలున్నాయి. ఇటీవల జరిగిన బదిలీల్లో బయట స్టేషన్లకు వెళ్లినప్పటికీ సీఐ, ఎస్ఐల కదలికలు ఇసుక రవాణాదారులకు చేరవేస్తున్నట్లు సమాచారం.

హాస్టళ్లలో మరమ్మతులకు నివేదిక ఇవ్వండి

● బీసీ సంక్షేమాధికారి ప్రసూన



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసూన

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 7 : బీసీ సంక్షేమ హాస్టళ్లలో చేపట్టాల్సిన చిన్న చిన్న మరమ్మతులకు సంబంధించి రూ.1.50 లక్షల లోపు అంచనాలు తయారు చేసి నివేదిక ఇవ్వాలని బీసీ సంక్షేమాధికారి కొల్లి ప్రసూన ఆదేశించారు. సోమవారం ఆమె తన కార్యాలయంలో హెచ్‌డబ్ల్యువోలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ నివేదికను ప్రభుత్వానికి వెంటనే పంపాలన్నారు. నిర్లక్ష్యం చేయవద్దని హెచ్‌డబ్ల్యువోలను ఆదేశించారు.

వక్ఫ్ చట్టం సవరణలపై నేడు సదస్సు

నెల్లూరు(వైద్యం) : వక్ఫ్ చట్ట సవరణలు - దాని పరిణామాలు అనే అంశంపై నగరంలోని డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం సదస్సు నిర్వహిస్తున్నట్లు అవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ రషీద్ తెలిపారు. సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ సదస్సుకు అవాజ్ వ్యవస్థాపకుడు, మాజీ ఎమ్మెల్యే ఎంఏ గఫూర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో అవాజ్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రఫీ, సభ్యులు చాంద్‌బాషా, షేక్ ఫయాజ్, షేక్ రియాజ్, అమానుల్లా తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

నెల్లూరు(విద్య), అక్టోబరు 7 : గుంటూరు జిల్లాలో ఈనెల 15వ తేదీ నుంచి జరిగే రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు రాయ్ చెస్ అకాడమీ నిర్వాహకులు అజీజ్ తెలిపారు. సోమవారం నగరంలోని వివేకానంద జూనియర్ కళాశాలలో జరిగిన చెస్ ఎంపికల పోటీల్లో అండర్-15 ఓపెన్ విభాగంలో యజ్ఞేశ్వర్‌రెడ్డి, హిమతేజస్విని, బాలుర విభాగంలో ద్వారకనాథ్, యస్విన్, సుష్వంత్, బాలికల విభాగంలో సుదీక్ష, గానవిశ్రీ, గీతికశ్రీలు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ పోటీలను కళాశాల కరస్పాండెంట్ విష్ణు, ఆర్బిటర్ మౌనిక పర్యవేక్షించారు.

ప్రకృతిలో మార్పుల పర్యవేక్షణకు స్పేస్ టెక్నాలజీ

● షార్ జనరల్ మేనేజర్ దామోదరం

నెల్లూరు(విద్య), అక్టోబరు 7: ప్రకృతిలో వచ్చే మార్పులు, స్థితిగతులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు స్పేస్ టెక్నాలజీ ఎంతో ఉపయోగపడుతుందని షార్ జనరల్ మేనేజర్ జె.దామోదరం అన్నారు. నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం షార్ సారధ్యంలో వరల్డ్ స్పేస్ వీక్-2024 పేరుతో నిర్వహించిన అంతరిక్ష వారోత్సవాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. స్పేస్ క్లైమేట్ చేంజ్ అనే అశం మీద జరిగే ఈ వారోత్సవాలను ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈనెల 9వతేదీ వరకు నిర్వహిస్తున్నామన్నారు. వాతావరణంలో వచ్చే మార్పులను ప్రజలకు, యువతకు తెలియచేయాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమాలు చేపట్టామన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలలకు చెందిన 8 నుంచి 10వ తరగతి, జూనియర్ కళాశాలలు, డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులు పెద్దఎత్తున హాజరవడం అభినందనీయమని తెలిపారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య విజయభాస్కర్ మాట్లాడుతూ షార్ నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా నేటితరం విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాల వైపు ఆసక్తిని పెంచుకునేందుకు ఎంతో దోహదం చేస్తుందన్నారు. విద్యార్థులు టెక్నాలజీని వినియోగించుకుంటూ నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీ.శ్రీనివాసులరెడ్డి, కన్వీనర్ డాక్టర్ కే.మురళి, కేవీ.కృష్ణ, ఏజీఎం శ్రీధర్, శాస్త్రవేత్తలు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, పాల్గొన్నారు.



అంతరిక్ష వారోత్సవాల ప్రారంభంలో షార్, కళాశాల ప్రతినిధులు

రీసెర్చ్‌లపై ప్రత్యేక దృష్టి

● విద్యార్థుల ఉపాధికి చర్యలు

● వీఎస్‌యూ ఉపకులపతి విజయభాస్కర్‌రావు



ఇంటర్వ్యూ...

వెంకటాచలం, అక్టోబరు 7: తాను బాధ్యతలు స్వీకరించి నాలుగు నెలలు కావస్తున్నదని, అప్పటి నుంచి రీసెర్చ్‌లపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వీఎస్‌యూ వీసీ డాక్టర్ సారంగం విజయభాస్కర్ రావు తెలిపారు. సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ రీసెర్చ్‌ల కోసం ప్రత్యేక విభాగాన్ని కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ విభాగం ద్వారా రీసెర్చ్ చేసేవారిని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రీసెర్చ్‌లు కూడా ముమ్మరంగా జరుగుతున్నాయని వివరించారు. యూనివర్సిటీ అభివృద్ధికి ఇప్పటికే ఓ ప్రణాళిక రూపొందించుకొని, అందరి సహకారంతో ముందుకు వెళుతున్నట్లు వెల్లడించారు. వీఎస్‌యూలో చదువుకుంటున్న విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఇందుకోసంగా పలు కంపెనీలతో ఎంవోయూలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే యూనివర్సిటీలో ప్రముఖ కంపెనీల ఆధ్వర్యంలో జాబ్‌మేళా కూడా నిర్వహించామన్నారు. యూనివర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలల అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. మౌలిక వసతుల కల్పన, అధ్యాపకులకు శిక్షణ, నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యా విధానంలో ప్రవేశపెట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు వర్సిటీలో అన్ని సౌకర్యాలతో కూడిన హాస్టళ్లు, శారీరక ఆరోగ్యాన్ని మెరుగుపరిచేందుకు ఓపెన్ జిమ్‌తోపాటు నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నట్లు వీసీ వెల్లడించారు. విద్యార్థులకు సమాజసేవపై అవగాహన కల్పించేందుకు ఎన్ఎస్ఎస్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వర్సిటీ అభివృద్ధికి అందరి సహకారం ఎంతో అవసరమన్నారు. ఆ దిశగా తనవంతు కృషి చేస్తున్నానని వీసీ చెప్పారు.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

FLAT FOR SALE

నెల్లూరు నగరంలో మదర్ ల్యాండ్ డెవలపర్స్ వారి నూతనంగా నిర్మించుచున్న ప్రీమియం అపార్ట్మెంట్స్ (రైన్ స్పేర్స్ థియేటర్ Back Side & Santhi Nagar) నందు 2BHK & 3BHK Flats అమ్మకమునకు కలవు. సెల్: 79954 22204, 79954 22201

AJR-295255

బంపర్ ఆఫర్

J.P.Infra వారి ఆఫర్, ప్రతి అం10 వేలు తగ్గింపు, ఈనెల 15వ తేదీ వరకు మాత్రమే. గూడూరు బైపాస్‌ప్రక్కన, RTC బస్టాండ్ 5 నిమిషాలు ప్రయాణం & NH5 ఆనుకొని ఇళ్ళ మధ్యలో వెంటనే ఇల్లు కట్టుకొనుటకు ప్లాట్లు కలవు. సం.ప్ర. సెల్: 80744 85697

AJR-193813

FINANCE

గవర్నమెంట్ ఎంప్లాయిస్‌కి, రిటైర్డ్ పెన్షనర్లకి సులభవాయిదాలలో ఫైనాన్స్ మరియు ఇళ్ళు, స్థలాలపైన బ్యాంకులోను ఉన్నా సరే సెకండ్ మార్ట్‌గేజ్‌పై లోను 10లక్షల లోపు చెయ్యబడును. (సిబిల్ చూడబడదు) సెల్: 9666547338

AJD-186750

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడీవీటీ

పాచి తొలగించరు.. లీకేజీ నివారించరు!



కలిగిరిలో శిథిలావస్థలో ఉన్న వాటర్‌ట్యాంకు

● గ్రామాల్లో ట్యాంకుల పర్యవేక్షణ కరువు ● కలుషిత నీటితో జనం అవస్థలు

కలిగిరి, అక్టోబరు 7: గ్రామీణులకు సురక్షిత మంచినీరు అందించడానికి ఏర్పాటుచేసిన రక్షిత తాగునీటి పథకాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి గురించి పాలకులు, అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. మండలంలోని అనేక గ్రామాల్లో ఉన్న నీటి పథకాల నిర్వహణ సరిగాలేక శిథిలావస్థకు చేరాయి. నిర్వహణ సంగతి సంగతి అటుంచితే కనీసం నీటి శుభ్రత విషయంలో కూడా పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దీంతో కలుషిత నీరు తాగి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పంచాయతీల్లో నిధుల కొరత కారణంగా ట్యాంకుల శుభ్రత కూడా నామ మాత్రంగా నిర్వహి స్తున్నారు. నెలలో రెండుసార్లు ట్యాంకు లను శుభ్రం చేయాల్సి ఉండగా, మూడునెలలకొకసారి కూడా శుభ్రం చేయడం లేదు. ఇంటి, కుళాయి పన్నులను విధిగా వసూలు చేస్తున్న అధికారులు ప్రజలకు సేవలు అందించడంలో మాత్రం విఫలమవుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కాబట్టి రక్షిత నీటి పథకాల నిర్వహణపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

ఇబ్బందులు లేకుండా చూడాలి



కలిగిరి వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. లీకులతో పాచిపట్టి కూలే స్థితికి చేరుకుంది. సామర్థ్యం తక్కువ కావడంతో ప్రతిరోజూ పట్టణ వాసులకు తాగునీరు అందించలేక రెండురోజులకొకసారి అందిస్తున్నారు. అధిక కెపాసిటీతో ట్యాంకు నిర్మించి, ప్రజలకు తాగునీరు ఇబ్బందులు లేకుండా చూడాలి.

- నందనవనం ప్రభాకరరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు

మర్రిపాడు ఎంపీడీవోగా నాగేశ్వర ప్రసాద్

మర్రిపాడు, అక్టోబరు 7: స్థానిక ఎంపీడీవోగా నాగేశ్వరప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లా నుండి వచ్చిన ఆయనను కార్యదర్శులు సన్మానించారు.

పేట ఎంపీడీవోగా ప్రసన్నకుమారి

ఏఎస్ పేట: స్థానిక ఎంపీడీవోగా పి.ప్రసన్నకుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని తెలిపారు. అలాగే మండలంలో ఆర్ఐ మస్తాన్‌వలీ, ఐదుగురు వీఆర్‌వోలు సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

కల్పవృక్ష వాహనంపై శ్రీవారి విహారం



కల్పవృక్ష వాహనంపై విహరిస్తున్న వేంకటేశ్వర స్వామి

కావలి టౌన్, అక్టోబరు7: స్థానిక బృందావనం కాలనీలోని శ్రీవెంకటేశ్వర స్వామి సోమవారం ఉదయం శ్రీవారికి కల్పవృక్ష, రాత్రి సర్వభూపాల వాహన సేవలందుకున్నారు. టీటీడీ అర్చక బృందం సభ్యులతో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరామ్‌మాల్యాద్రి ఈ ఉత్సవాలను నిర్వహించారు. రాత్రి శ్రీవారు సర్వభూపాల వాహనం విహరిస్తూ నిర్వహించిన గ్రామోత్సవం కనులపండువగా సాగింది.

కోర్సు పూర్తయినా సర్టిఫికెట్స్ ఇవ్వలేదు

● ఆర్డీవోకు ఫిర్యాదు చేసిన నర్సింగ్ విద్యార్థులు



కావలి ఉపవైద్యాధికారి బ్రిజితకు విన్నవిస్తున్న నర్సింగ్ విద్యార్థినులు

కావలి, అక్టోబరు7: తమకు నర్సింగ్‌కోర్సు పూర్తయినా సర్టిఫికెట్స్ ఇవ్వకుండా కళాశాల యాజమాన్యం వేధిస్తుందని కావలి శ్రీసాయి స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు వారు సోమవారం ప్రజాసమస్యల పరిష్కారవేదికలో కావలి ఆర్డీవో వంశీక్రిష్ణను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ విషయంలో తమకు న్యాయం చేయాలని కోరారు. వెంటనే ఆయన కావలి ఉపవైద్యాధికారి బ్రిజితను అక్కడికి పిలిపించారు. 30 మంది విద్యార్థినులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ నర్సింగ్‌లో చేరారని, కోర్సు చేర్చుకునే సమయంలో ఫీజులు ప్రభుత్వం చెల్లిస్తుందని చెప్పి ఇప్పుడు ఫీజులు కడితేనే సర్టిఫికెట్స్ ఇస్తామని చెపుతున్నట్లు తెలిపారు. ఈ విషయంపై కళాశాల యాజమాన్యంతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని ఆర్డీవోకు తెలిపారు.

వైఎస్సార్ విగ్రహ ధ్వంసానికి యత్నం

వరికుంటపాడు, అక్టోబరు 7: తోటలచెరువుపల్లి బస్టాండ్ సెంటర్‌లోని దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ విగ్రహాన్ని సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేసేందుకు ప్రయత్నించారు. విగ్రహం ఎడమ చేయి, కాలును కొంతమేర విరగ్గొట్టడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. విషయం తెలుసుకున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకొని పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వివాదాస్పద స్థలంలోని సిమెంటు ఒరల తొలగింపు

లింగసముద్రం, అక్టోబరు 7: పెదపవనిలో వివాదాస్పద స్థలంలో ఓ వ్యక్తి వేసిన సిమెంటు ఒరలను సోమవారం ఎస్ఐ మహమ్మద్ సుబానీ సిబ్బందితో వెళ్లి వాటిని తొలగింపచేశారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ఈ స్థలం వద్ద పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. గ్రామంలోని సర్వే నంబరు 439-1కి సంబంధించిన ఈ స్థలంలో రెండు వర్గాల మధ్య వివాదం కొనసాగుతోంది. రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఈ స్థలంలోకి ఎవరూ ప్రవేశించకూడదని గతంలో బోర్డులు ఏర్పాటు చేశారు. అప్పట్లో పోలీస్‌లు ఈ స్థలం వద్ద కొంత కాలం పాటు పోలీసులు కాపలా ఉన్నారు. అయితే ఆదివారం రాత్రి మాల్యాద్రి ఇందులో సిమెంటు ఒరలు వేయడంతో రెండోవర్గంకు చెందిన ఎస్ఎం బాషా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ చర్యలు తీసుకున్నారు.

ఎస్సీ కాలనీల్లో వీధిలైట్ల ఏర్పాటు



వలేటివారిపాలెం, అక్టోబరు 7: అంకభూపాలపురం ఎస్సీ కాలనీలో పంచాయతీ అధికారులు పనిచేయని వీధిలైట్లకు మరమ్మతులు చేయించారు. కొన్ని ప్రాంతాల్లో కొత్త వాటిని ఏర్పాటు చేశారు. అంధకారంలో అంకభూపాలపురం ఎస్సీ కాలనీ అని ఈ నెల 2వ తేదిన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి పంచాయతీ పాలకులు, అధికారులు స్పందించారు. కాలనీవాసులు ఆంధ్రజ్యోతికి అభినందనలు తెలిపారు.

విరిగిన విద్యుత్ స్తంభం

కావలి, అక్టోబరు 7: స్థానిక ముసునూరు గ్లోబల్ స్కూల్ ఎదురుగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో విద్యుత్ స్తంభం విరిగింది. విద్యుత్ తీగల ఆధారం బలంగా ఉండటంతో నిలబడి ఉంది. ఈ స్తంభం ఎప్పుడు కింద పడుతుందో అని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే విరిగిన స్తంభం స్థానంలో కొత్త దాన్ని ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కావలి ఆర్డీవోకు సత్కారం



ఆర్డీవో వంశీకృష్ణను సత్కరిస్తున్న స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు

కావలి టౌన్, అక్టోబరు 7: ఆర్డీవో వంశీకృష్ణను సోమవారం కార్యాలయంలో వివిధ స్వచ్ఛంద సంస్థల గౌరవాధ్యక్షుడు ఎస్‌కె ఖాదర్‌బాష ఆధ్వర్యంలో సంస్థల నిర్వాహకులు సత్కరించారు. ఈ సందర్భంగా వారు చేస్తున్న సామాజిక సేవలను వివరించారు. కార్యక్రమంలో ఎంవీ ప్రసాద్‌రావు, సురేంద్ర, మధుసూధన్‌రావు, జమీర్, బ్రహ్మయ్య, మస్తానయ్య, రమేష్, రామచంద్రయ్య పాల్గొన్నారు.

కావలి: రెడ్‌క్రాస్ జిల్లా పాలకమండలి సభ్యులు, మానసిక వికలాంగుల కేంద్రం బాధ్యులు దాసరి రాజేంద్రప్రసాద్ సోమవారం కావలిలో ఆర్డీవో వంశీక్రిష్ణను కలిసి జ్ఞాపికను అందజేశారు. జిల్లా రెడ్‌క్రాస్ సేవలు గురించి వివరించారు. కార్యక్రమంలో కావలి రెడ్‌క్రాస్ చైర్మన్, రాష్ట్ర పాలకమండలి సభ్యులు రవిప్రకాష్, స్పాస్టిక్ సెంటర్ ఫిజియోథెరపీ వైద్యులు నవీన్ పాల్గొన్నారు.

ఆర్ఎస్ఆర్‌లో మెగా రక్తదాన శిబిరం

బిట్రగుంట, అక్టోబరు 7: కడనూతల ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఫౌండర్ ట్రస్ట్ మెంబర్ ఆర్.కుమారస్వామి జ్ఞాపకార్థం ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. న్యూ విజన్ బ్లడ్‌బ్యాంక్ ఒంగోలు వారి సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో యువకులు రక్తదానం చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎన్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కిరణ్‌కుమార్, అధ్యాపకులు ఉన్నారు.

నీటి సరఫరాకు నేడు అంతరాయం

కందుకూరు, అక్టోబరు 7: స్థానిక మున్సిపాలిటి పరిధిలో మంగళవారం తాగునీటికి అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ అనూష ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్ఎస్ ట్యాంక్ ఏరియేషన్ ప్లాంట్ వద్ద గేట్లు మర్చుతున్నందున ప్రజలు గమనించాలని పేర్కొన్నారు.

కావలిలో కుక్కల బెడద

కావలి, అక్టోబరు 7: పట్టణంలో కుక్కల బెడద ఎక్కువగా ఉండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. సోమవారం ఉదయం ఉదయగిరి రోడ్డులోని మినీ స్టేడియం గ్రౌండ్‌లో వాకింగ్ చేస్తున్న బిట్రగుంట తహసీల్దార్ మలిశెట్టి సురేష్‌బాబును ఒక గ్రామ సింహం అరవకుండా వచ్చి కరిచింది. మున్సిపల్ అధికారులు స్పందించి కావలిలో వీటి నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పాపాలను హరించు మహాచండీ

● వైభవంగా శరన్నవరాత్రి మహోత్సవాలు
● ఐదో రోజు వివిధ అలంకరణల్లో దర్శనమిచ్చిన అమ్మవారు

కావలి టౌన్, అక్టోబరు 7: పట్టణంలో దేవి శరన్నవరాత్రోత్సవాల శోభసంతరించుకుంది. సోమవారం కలుగోళశాంభవి అమ్మవారు మహాలక్ష్మీదేవిగా, పాతూరు శివాలయంలో దుర్గాభ్రమరాంబ అమ్మవారు గజలక్ష్మీగా, విష్ణాలయం రాజ్యలక్ష్మీ అమ్మవారు గజలక్ష్మీ అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వడ్డెపాలెం కనకదుర్గాదేవి మహాలక్ష్మీదేవిగా ముసునూరు మహాలక్ష్మమ్మ అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ముసునూరు హనుమత్ క్షేత్రంలో దుర్గాదేవి అమ్మవారు లలిత త్రిపుర సుందరి దేవిని అలంకరణ చేపట్టారు.

కందుకూరు: పట్టణంలో కోవూరు రోడ్డులోని దుర్గామాత మహా చండీరూపంలో భక్తులకు దర్శనిమిచ్చారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులు పొందారు. ఆయల నిర్వాకులు అమ్మవారి తీర్థప్రసాదాలు వితరణ చేశారు.

బిట్రగుంట: విశ్వనాథరావుపేట కోదండరామాలయం రాజరాజేశ్వరిదేవి మహాచండీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. బోగోలు రాజావీధిలోని షిర్డి సాయిబాబా మందిరంలో అమ్మవారి అలంకరణ పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు.

లింగసముద్రం: స్థానిక ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పద్మావతి అమ్మవారు లలితా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చారు. కార్యక్రమానికి ఉభయకర్తగా ఉమ్మడిశెట్టి సుబ్బారావు వ్యవహరించారు.

అల్లూరు: స్థానిక కన్యకా పరమేశ్వరి పార్వతీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పోలేరమ్మ, కలుగోళమ్మ, బీసీ కాలనీలోని పోలేరమ్మ చెట్టు వద్ద అమ్మవార్లకు విశేష పూజలు చేసి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

కలిగిరి: తెల్లపాడు భద్రకాళి అమ్మవారిని అన్నపూర్ణదేవిగా అలంకరించి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం అష్టోత్తర శతనామావళి కుంకుమార్చన చేపట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా మారెళ్ల పెదమాల్యాద్రి రెడ్డి, పద్మావతి దంపతులు, కుమారుడు మహదేవరెడ్డి, మమతలు ఉన్నారు.

ఆత్మకూరు: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గజలక్ష్మీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శివాలయంలో అన్నపూర్ణాదేవి సరస్వతీదేవి అలంకారంలో, తిరునాళ్ళతిప్పలోని కాశీనాయన ఆశ్రమ ఆవరణలోని అమ్మవారు రాజరాజేశ్వరీదేవిగా, ఉత్తర బలిజ వీధిలోని జ్వాలాముఖి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి విశేష పూజలు, కుంకుమార్చన నిర్వహించారు.



ఆత్మకూరు: అన్నపూర్ణాదేవి అలంకరణలో జ్వాలాముఖిదేవి



కందుకూరు: మహాచండీ అలంకరణలో అమ్మవారు

ఉదయగిరి రూరల్: పట్టణంలోని పార్వతీపరమేశ్వరాలయం, శ్రీసంతాన లక్ష్మిదేవి ఆలయాల్లో అమ్మ వారు మహాచండిదేవి, శ్రీలలితాత్రి పుర సుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు అమ్మవార్లకు ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించి భక్త లకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

వరికుంటపాడు: తూర్పురొంపిదొడ్లలోని శ్రీమానసాదేవి స్కందమాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వరికుంటపాడులోని శ్రీనాగరప్పమ్మ ఆలయంలో అమ్మవారు కామాక్షీదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, కుంకుమార్చన నిర్వహించి తీర్థప్రసాదాలను అందజేశారు.

సంగం : స్థానిక సంగమేశ్వరాలయంలో శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఐదో రోజు సోమవారం కామాక్షిదేవి అమ్మవారు సంతానలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, పల్లకీసేవ నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.



వరికుంటపాడు: స్కంధమాత అలంకరణలో మానసాదేవి



కావలి టౌన్: లలితా త్రిపుర సుందరిగా దుర్గాదేవి



ఉదయగిరి రూరల్: మహాచండీదేవిగా అమ్మవారు



బిట్రగుంట: మహాచండీదేవి అలంకరణలో రాజరాజేశ్వరి దేవి

అధికారుల తీరు మారలేదు!

● ప్రజా సమస్యల పరిష్కార వేదికకు మొక్కుబడిగా వచ్చి వెళుతున్న అధికారులు



కలువాయి: ఉదయం 10.30గంటలకు హాజరైన ఇద్దరు ఉద్యోగులు

కలువాయి, అక్టోబరు 7: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంపై అధికారుల తీరు మారలేదు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన కార్యక్రమం మొక్కుబడిగా మారిపోయింది. కార్యాలయం సీనియర్ అసిస్టెంట్, మండల విద్యాశాఖాధికారి-2 ఇద్దరు మాత్రమే హాజరయ్యారు. ఆ తరువాత కొంతసేపటికి తహసీల్దారు శ్యామ్‌సుందరరాజు వచ్చారు. కార్యక్రమానికి తరచూ డుమ్మా కొట్టే వారిపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేక చిన్న సమస్యకు కూడా ప్రజలు వ్యయ ప్రయాసలు పడి జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో జరిగే కార్యక్రమానికి వెళ్తున్నారు.

వలేటివారిపాలెం: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి తహసీల్దార్, ఇన్‌చార్జి ఎంపీడీఓ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాత్రమే హాజరయ్యారు. మిగిలిన అన్నిశాఖల అధికారులు డుమ్మా కొట్టారు. ఆయా శాఖల అధికారులు వస్తారని వ్యయ ప్రయాసల కు ఓర్చి దూరప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలకు నిరాశ మిగిలింది. అర్జీదారులు ఎదురుచూసి వెనుదిరిగారు.

అండగా నిలిచిన వారందరినీ ఆదుకుంటాం

● టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న బీద రవిచంద్ర

అల్లూరు, అక్టోబరు 7: ఎన్నికల సమయంలో భిన్నమైన పరిస్థితులు ఉన్నాయని అందరూ తెలుగుదేశంకు అండగా నిలిచారని వారందరికీ నేడు అండగా ఉంటామని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర అన్నారు. మండలంలోని ఆయన స్వగ్రామమైన ఇస్కపల్లిలో ఆయన వక్ఫ్‌బోర్డు ఛైర్మన్, నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, టీడీపీ పార్లమెంటు ప్రధాన కార్యదర్శి, చేజర్ల వెంకటేశ్వర్లు రెడ్డిలతో కలసి సోమవారం రాత్రి పర్యటించారు. ఈ సందర్భంగా గంగమ్మ ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇస్కపల్లి వాసిగా తాను తమ గ్రామానికి అవసరమైన అన్ని వసతులు కల్పించి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. చేస్తున్నానన్నారు. గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్థానికంగా పర్యటించినపుడు ఆయన ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరగా అందుకు సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఇస్కపల్లిలో జూనియర్ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీద గిరిధర్, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, కొండూరు పాలుశెట్టి, పాపనబోయిన రత్తయ్య, కృష్ణ చైతన్య పాల్గొన్నారు.

పూడికతీత పనులు చేపట్టాలి

ఆత్మకూరు, అక్టోబరు 7: ఆత్మకూరు చెరువు కింద ఉన్న పంట కాలువల్లో పూడికతీత పనులు చేపట్టి రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు లక్కు కృష్ణప్రసాద్ కోరారు. ఈమేరకు సోమవారం ఆయన రైతులతో కలిసి ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కాలువల్లో ఏళ్లతరబడి పూడికతీత పనులు చేపట్టకపోవడంతో సాగునీరు అందడం లేదని, కావున పూడికతీత పనులు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచారం ఉండాలి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 7: మండలంలో పని చేసే సీఆర్‌ఎంటీలు వారి పరిధిలోని పాఠశాలలకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని అందుబాటులో ఉంచుకోవాలని ఎంఈవో-2 తోట శ్రీనివాసులు సూచించారు. సోమవారం తన కార్యాలయంలో సీఆర్‌ఎంటీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిబయట పిల్లలను గుర్తించి బడిలో చేర్పించాలన్నారు. పదో తరగతి ఫెయిలైన విద్యార్థులను ఓపెన్ స్కూల్‌లో చేర్పించాలన్నారు. కోడిగుడ్లు, చిక్కీలు సకాలంలో ప్రధానోపాధ్యాయులు ఇండెంట్ పెట్టేవిధంగా చూడాలన్నారు. పాఠశాలల్లో ఉండే ఆర్వో ప్లాంట్లు పని చేస్తున్నాయో లేదో పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో సీఆర్‌ఎంటీలు సిద్ధయ్య, భోగ్యం శ్రీనివాసులు, ఇనయితుల్లా, మొహిద్దీన్, రమణారెడ్డి, మౌలా ద్రి తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీరు తొలగింపునకు చర్యలు

ఏఎస్ పేట, అక్టోబరు 7: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో రోడ్డుపై వర్షపు నీరు చేరి గత కొన్ని నెలలుగా ప్రజలు ఇబ్బంది పడుతుండడంతో ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో అధికారులు స్పందించారు. సోమవారం ఆర్‌అం డ్‌బీ జేఈ అనూసుల్లాఖాన్, పంచాయతీ అధికారులు పరిశీలించి వర్షపు నీటిని తొలగించి మరలా చేరకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట టీడీపీ నాయకుడు సర్పంచ్ భర్త జిలానిబాషా, కార్యదర్శి వినాయక్, విశ్రాం త వర్క్ ఇన్‌స్పెక్టర్ స్వామి పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయం ప్రారంభం

ఆత్మకూరు, అక్టోబరు 7: పట్టణంలో సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, రూరల్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుంకర పెంచల చౌదరి, కేతా విజయభాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు, టీడీపీ కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌ఛైర్మన్ షేక్ సర్దార్, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి, తెలుగు యువత జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, మున్సిపల్ కౌన్సిలర్లు నూరా భాస్కరరెడ్డి, షేక్ గౌస్‌బాష, గండళ్ల వేణు, పలువురు టీడీపీ నాయకులు, మాజీ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

ఖాళీల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉదయగిరి రూరల్, అక్టోబరు 7: నెల్లూరు అక్కచెరువుపాడులోని ఏపీ మైనారిటీ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న పీజీటీ ఫిజికల్ సైన్స్ పీఈటీ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ గల్లా మురళీకృష్ణ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డీఎస్సీ నిబంధనల ప్రకారం డెమో నిర్వహించి అర్హత సాధించిన వారిని ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు 13లోపు దరఖాస్తులను పాఠశాలల్లో అందించాలన్నారు. వివరాలకు 8712625045 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఏఐటీయూసీ జెండా ఆవిష్కరణ

ఉదయగిరి రూరల్, అక్టోబరు 7: స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో సోమవారం ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంకర్‌కిశోర్ ఆటో కార్మికులతో కలిసి జెండాను ఆవిష్కరించారు. నియోజకవర్గంలోని సంఘటిత, అసంఘటితరంగ కార్మికులను కలుపుకొని ఏఐటీయూసీని బలోపేతం చేస్తామన్నారు. బస్టాండ్ సెంటర్‌లో ఆటోస్టాండ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని పోలీసులకు విన్నవించారు.

ప్రగతిపథంలో వస్త్ర వ్యాపారం



వస్త్ర దుకాణంను ప్రారంభిస్తున్న పీఏబీసీ చైర్మన్ జీడీడీ దివాకర్

కావలి టౌన్, అక్టోబరు7: కావలి వస్త్రవ్యాపారం ప్రగతిపథంలో నడుస్తుందని పీఏబీసీ చైర్మన్ జీడీడీ దివాకర్ తెలిపారు. సోమవారం జమున కాంప్లెక్స్‌లో ఐరా వస్త్ర దుకాణం ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. హోల్‌సేల్ వస్త్ర వ్యాపారంలో కావలికి ప్రత్యేకత ఉందని, ఈ రంగంలో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకుంటుందని అందుకు తగిన అవకాశాలు ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో ఆస్ట్రాలజర్ కృష్ణారెడ్డి గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టు అర్హత కల్పించాలి

బిట్రగుంట, అక్టోబరు 7: ప్రభుత్వం దళిత గిరిజనులకు పంపిణీ చేసిన భూముల్లో ఆయకట్టు అర్హత కల్పించాలని కడనూతల దళిత రైతులు సోమవారం తహసీల్దారు సురేష్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. 45ఏళ్ల కిందట 50 సెంట్ల చొప్పున 30 ఎకరాలు పంపిణీ చేశారని, అందులోనే కడనూతల చెరువు నీటితో వరి సాగు చేసుకుని జీవిస్తున్నట్లు చెప్పారు. ఇపుడు అర ఎకరం చొప్పున పొలం సాగు చేసుకునే దళితలకు ఆయకట్టులో అర్హత లేదని ఇరిగేషన్ అధికారులు నోటీసులు జారీ చేయడం ఎంతవరకు సమంజమని ప్రశ్నించారు. అనంతరం కావలి కార్యాయంలోని మండల ఇరిగేషన్ డీఈ పీఎంఖాన్, జేఈ జితేంద్రరెడ్డిని వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వెంగమాంబ సన్నిధిలో రేపు వేలం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), అక్టోబరు 7: నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయ ఆవరణలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా భక్తులు సమర్పించిన బియ్యం, పాత ఇనుప సామాగ్రి, గోశాలలో ఎరువులకు బుధవారం బహిరంగ వేలంపాటలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి వెట్టిగుంట ఉషశ్రీ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు, దేవదాయ ధర్మదాయ శాఖల అధికారుల సమక్షంలో వేలంపాటలు నిర్వహించనున్నట్లు, ఆసక్తి గలవారు ధరావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు.

15న పురపాలక సంఘం షాపుల వేలం

కందుకూరు, అక్టోబరు 7 : స్థానిక మున్సిపాలిటీ షాపుల బహిరంగ వేలం 15న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అనూష సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ హాస్పిటల్ ఎదురుగా వైఎస్ఆర్ షాపింగ్ కాంప్లెక్స్, పాత కూరగాయల మార్కెట్ స్కందపురి వాణిజ్య సముదాయం, కల్లూరి కోటేశ్వరరావు షాపింగ్‌లో ఖాళీ షాపులు, ముత్యాలగుంట పార్కు వద్ద ఖాళీ షాపులు ఉన్నాయని చెప్పారు. గజిట్ నోటిఫికేషన్ షరతులకు లోబడి వేలం నిర్వహిస్తామన్నారు. ఉదయం 11గంటలకు పురపాలక సంఘం కార్యాలయంలో జరిగే వేలంలో పాల్గొనవచ్చన్నారు.

సస్యరక్షణ పద్ధతులపై శిక్షణ



చేజర్ల : విత్తనశుద్ధి గురించి వివరిస్తున్న విజయ్‌కుమార్

ఉలవపాడు, అక్టోబరు 7: వరి, వేరుశనగ పైరుల యాజమాన్య సాగులో సస్యరక్షణ పద్ధతులపై సోమవారం కరేడులోని రైతు సేవా కేంద్రంలో రైతులకు జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు సీహెచ్ మారుతిదేవి, లక్ష్మీ మాధవి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు వంశీకృష్ణ, మానసా ప్రియదర్శిని ఉన్నారు.

చేజర్ల: మినుము పంట వేసే రైతులు తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకోవాలని నెల్లూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా. విజయ్‌కుమార్ నాయక్ సూచించారు. సోమవారం మండంలోని చేజర్ల సమీపంలో విత్తనశుద్ధి కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనశుద్ధి చేయడం వల్ల తెగుళ్ల నుంచి పంటను కాపాడుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఏఏ మమత, రైతులు పాల్గొన్నారు.

నైపుణ్య పరికరాలపై శిక్షణ

కందుకూరు: వ్యవసాయంలో మహిళలకు శ్రమ తగ్గించే పరికరాలు వాటి నైపుణ్యంపై కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు వివేక్ కామత్, డాక్టర్ వెంకటేష్ సోమవారం శిక్షణ ఇచ్చారు. పలుకూరు గ్రామం ఎస్సీ కాలనీలో జరిగిన కార్యక్రమంలో మహిళలకు చిన్నపాటి వ్యవసాయ పరికరాలు వాటి ఉపయోగాలను వివరించారు. పని సామర్థ్యం పెంచుకోవడంలో మెళకువలు, వ్యవసాయ పనుల్లో ఉత్పాదకతను పెంచే విధానాన్ని తెలిపారు. ఐదు రోజుల శిక్షణ ఇవ్వనున్నట్లు శాస్త్రవేత్తలు తెలిపారు. అనంతపురం జిల్లాకు చెందిన దక్షిణ ప్రాంత వ్యవసాయ యంత్రాల శిక్షణ, పరీక్షా సంస్థ సహకారంతో ఈ శిక్షణ కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో ఆసంస్థ సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ కనకప్ప, సీనియర్ టెక్నీషియన్ భాస్కరరావు, వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

ఉప సర్పంచులు, వార్డుసభ్యులకు శిక్షణ



సూచనలిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరాజు

ఉదయగిరి రూరల్, అక్టోబరు 7: స్థానిక స్త్రీశక్తి భవనంలో సోమవారం మండలంలోని 17 పంచాయతీలకు చెందిన ఉప సర్పంచులు, వార్డుసభ్యులకు ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాసరాజు, ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ షేక్ కరీముల్లా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పంచాయతీల అభివృద్ధికి పలు సూచనలు, సలహాలను అందజేశారు. పంచాయతీల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నాగూర్‌బీ, ఆదోని శ్రీనివాసులు, ఆవుల వెంకటరమణ, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ వివరాలు సరిచేయాలి

ఉదయగిరి రూరల్, అక్టోబరు 7: ఆన్‌లైన్‌లో తమకు సంబంధించిన భూముల వివరాలను సరి చేయాలని సోమవారం రైతుసంఘం ఆధ్వర్యంలో మండలంలోని బిజ్జంపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు తహసీల్దారు సుభద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ 2003 భూపంపిణీలో ప్రభుత్వం పలువురు లబ్ధిదారులకు భూములను పంపిణీ చేసిందన్నారు. ఆ భూములను బాగుచేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారని, బ్యాంకుల్లో రుణాలు సైతం తీసుకున్నారన్నారు. అయితే ప్రస్తుతం ఆ భూముల వివరాలు ఆన్‌లైన్‌లో సరిగా లేకపోవడంతో 1బీ, అడంగల్ రాక ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నారన్నారు. అధికారులు స్పందించి ఆన్‌లైన్‌లో భూవివరాలను సరిచేయాలన్నారు. స్పందించిన తహసీల్దారు పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

నివాసాల మధ్య మద్యం దుకాణం వద్దు



తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న గేట్ సెంటర్ వాసులు

పొదలకూరు, అక్టోబరు 7: పట్టణంలోని రాంనగర్ గేట్ సెంటర్ వద్ద కొత్తగా మద్యం దుకాణం ఏర్పాటు చేయకుండా చర్యలు తీసుకోవాలని గేట్ సెంటర్‌కు చెందిన రమణయ్య, సత్యం, భాగ్యలక్ష్మి, ప్రసన్న కోరారు. సోమవారం వారు స్థానిక తహసీల్దారు కార్యాలయంలో ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దారు శివ బాలకృష్ణయ్యకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కూడా గేట్‌సెంటర్‌లో ఇళ్ల మధ్య మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల ఎన్నో ఇబ్బందులు పడ్డామన్నారు. అక్కడే స్కూలు, కాలేజీ, ఆలయం, ఆసుపత్రి ఉండడంతో భక్తులకు, విద్యార్థులకు అసౌకర్యంగా ఉంటుందన్నారు. కాబట్టి ఈ ప్రాంతంలో కాకుండా వేరే ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాల్సిందిగా వారు కోరారు. కార్యక్రమంలో రాంనగర్‌గేట్ సెంటర్ వాసులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం

పొదలకూరు, అక్టోబరు 7: స్థానిక శ్రీవిద్యాభారతి కోచింగ్ సెంటర్ పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు చర్మ కేన్సర్ బారినపడిన పసుపులేటి మాధవికి సోమవారం ఆర్థికసాయం చేశారు. తమ కోచింగ్ సెంటర్‌లో చదివిన ఆమెకు సెంటర్ నిర్వాహకులు ఎస్‌కె.సుభాన్, ఎస్‌కే.మహమ్మద్, డీ రవీంద్రకుమార్, టీ నరేంద్రరెడ్డి వాట్సప్ గ్రూప్‌గా ఏర్పడి విరాళాలు సేకరించారు. సేకరించిన మొత్తాన్ని మండలంలోని అయ్యగారిపాలెంలోని మాధవి ఇంటికెళ్లి రూ.లక్ష చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కే రవికుమార్, వీ రమేష్, యూ చిన్నమస్తాన్‌రావు, ఆర్.అంకయ్య, వీ సతీష్, ఎస్‌కే కరీముల్లా, పీ ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వపు తహసీల్దార్‌పై చర్యలేవీ ?



కలెక్టర్‌కి ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు

పొదలకూరు, అక్టోబరు 7: పూర్వపు తహసీల్దారు వీర వసంతరావు అవినీతి, అక్రమాలపై ఇంత వరకు చర్యలు చేపట్టలేదని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం వారు జిల్లాకలెక్టర్ ఆనంద్‌ను కలిపి వినతిపత్రం అందించారు. అనంతరం రైతు సంఘం నాయకులు రాధాకృష్ణమనాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు తలచీరు మస్తాన్‌బాబు, నాయకులు మద్దిరిళ్ల నరసింహులు, కలిచేటి శ్రీనివాసులురెడ్డి, పులిపాటి వెంకటేశ్వర్లునాయుడు మాట్లాడుతూ ఏఆర్సీ అనుమతులు లేకుండా నకిలీ అసైన్‌మెంట్ పట్టాలు సృష్టించి పేదలకు పంపిణీ చేశారన్నారు. అంతేకాక నిబంధనలకు విరుద్ధంగా వాగు, కొండ, మేత, పోరంబోకు భూములకు కూడా పట్టాలు ఇచ్చారన్నారు. తాము గతంలో ఈ భూకుంభకోణంపై సాక్షాధారాలతో సహా ఫిర్యాదు చేసినా, ఇంతవరకు చర్యలు తీసుకోలేదని వాపోయారు. వీరవసంతరావుపై చర్యలు తీసుకోకుండా అడ్డుపడుతున్నది ఎవరో తమకు తెలపాలన్నారు. వెంటనే అతడిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

బుచ్చి ఎంపీడీవోగా శ్రీహరి



శ్రీహరిని సన్మానిస్తున్న ఏవో మంజులమ్మ, సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 7: ఎంపీడీవోగా ఎం శ్రీహరి సోమవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆయన బుచ్చి ఎంపీడీవోగా మండలవాసులకు సుపరిచితులే. కోవూరు ఎంపీడీవో పనిచేస్తూ బదిలీపై బుచ్చికి వచ్చారు. కార్యాలయ ఏవో మంజులమ్మ, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.

● **పొదలకూరు ఎంపీడీవోగా నరసింహారావు**

పొదలకూరు : ఎంపీడీవోగా డీవీ నరసింహారావు సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా బుచ్చి నుంచి నరసింహారావు పొదలకూరుకి వచ్చారు. కార్యాలయ సిబ్బంది, స్థానిక నాయకులు ఆయనకు పుష్పగుచ్చాలు అందచేసి స్వాగతం పలికారు.

డీఎస్ఏ సిబ్బందికి నిత్యావసరాల పంపిణీ

నెల్లూరు(విద్య), అక్టోబరు 7 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో సోమవారం స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఎస్ఏ ఔట్ సోర్సింగ్ సిబ్బందికి 10 రకాల నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వాకర్స్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బీ శేషగిరిరావు మాట్లాడుతూ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ ఎమ్మెస్ రెడ్డి మనవరాలు ఇషారెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. వాకర్స్ సంఘాల ప్రతినిధులు డి.సుబ్బరాజు, ఎస్.బలరామ్‌నాయుడు, రాఘవేంద్రశెట్టి, భక్తవత్సలరెడ్డి, సురేంద్రబాబు, తిరుపతినాయుడు, వి.రంగారావు, రామ్మోహన్‌రెడ్డి, రాఘవరెడ్డి పాల్గొన్నారు.

తల్లీ.. మముకావవే!

వైభవంగా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ● కిటకిటలాడుతున్న ఆలయాలు

నెల్లూరు రూరల్, అక్టోబరు 7 : దేవీ నవరాత్రుల ఉత్సవాలలో అమ్మణ్ణుల అలంకరణలు నయనానందకరంగా భక్తులను ఆకర్షిస్తున్నాయి. నెల్లూరు రూరల్ మండలం వేదగిరి క్షేత్రంలో ఆదిలక్ష్మి సోమవారం సంతానలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవస్థాన ప్రధాన అర్చకుడు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి సూక్తహోమం నిర్వహించారు.

నెల్లూరు(సాంస్కృతికం) : నగరంలోని ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండరామపురం మహాలక్ష్మికి రూ.12లక్షల కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి అలంకారం జరిగింది. దేశమంతా సకాలంలో వర్షాలు పడి పాడిపంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షిస్తూ ఈ అలంకారం చేసినట్లు ఉభయకర్తలు ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహాసభ (హైదరాబాద్) మాజీ సీఈవో పెనల జగదీష్, శ్రీలక్ష్మి, అభినవ్, అభినయ్, అభినవ్యలు తెలిపారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ పత్తి నరసింహం, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

● మహాత్మ గాంధీనగర్ కృష్ణమందిరంలో వైభవలక్ష్మి అమ్మవారు ధైర్యలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు.

● నవాబుపేట శ్రీకృష్ణధర్మరాజులు స్వామి ఆలయంలో అమ్మవారికి రాజరాజేశ్వరిదేవీ అలంకారం వైభవంగా జరిగింది. కార్యక్రమాలను ఆలయ పునఃనిర్మాణ కమిటీ చైర్మన్ మద్దూరి సుబ్బారావు పర్యవేక్షించారు.

● మూలాపేట శ్రీకృష్ణధర్మరాజులుస్వామి ఆలయంలో శ్రీలలితా సుందరి అలంకారం జరిగింది.

● విరాట్‌నగర్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో గాయత్రీదేవి లలితా మహేశ్వరీదేవి అలంకారంలో భక్తులను కనువిందు చేశారు.

● అష్టలక్ష్మి ఆలయంలో ఉదయం, రాత్రి విశేష పూజలు, సాంస్కృతిక ప్రదర్శనలు, పల్లకీ సేవలు, మంగళహారతులు జరిగాయి. అష్టలక్ష్మి అమ్మవారు ధనలక్ష్మిగా దర్శనమిచ్చారు.

● బాలాజీనగర్ సీతారామమందిరం, నవాబుపేట, ఎన్టీఆర్ నగర్, బాలాజీనగర్, భక్తవత్సలనగర్, మూలాపేట, పత్తేఖాన్‌పేట, కల్లూరుపల్లి, తదితర ప్రాంతాల్లో వెలిసి ఉన్న మహాలక్ష్మి ఆలయాల్లో విశేష పూజలు, అలంకారాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

రంగనాథస్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 7 : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు 5వ రోజుకి చేరాయి. శ్రీదేవి భూదేవి సమేత రంగనాథస్వామికి, రంగనాయకమ్మలకు ప్రాకార ఉత్సవం అనంతరం ఊంజల్‌సేవ జరిగాయి. ఈ కార్యక్రమాలను చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, ఈవో ఆళ్ల శ్రీనివాసరెడ్డి, సిబ్బంది, పర్యవేక్షించారు.



నవాబుపేట శ్రీకృష్ణ ధర్మరాజుల స్వామి ఆలయంలో రాజరాజేశ్వరి అలంకారం



వేదగిరిపై సంతానలక్ష్మి అలంకరణలో ఆదిలక్ష్మి అమ్మవారు



సరస్వతి అవతారంలో నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరి

శ్రీరాజరాజేశ్వరిగా కామాక్షితాయి

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 7: జొన్నవాడ ఆలయంలో సోమవారం కామాక్షితాయి శ్రీరాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నవావరణ పూజలు నిర్వహించారు. రాత్రి అమ్మవారికి కాళరాత్రి నవావరణ పూజల అనంతరం కొలువు నిర్వహించారు. నెల్లూరుకి చెందిన ఆరుగుంట హరికిషోర్‌రెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు. మంగళవారం కామాక్షితాయి బండాసురవధ అలంకారంలో దర్శనమివ్వనున్నారు.



విడవలూరు : కరెన్సీ నోట్లతో ధనలక్ష్మి అలంకారం

● **కాళీయమర్దన అలంకారంలో కోదండరాముడు**

బుచ్చి పెద్దూరులో ఉన్న సీతా,లక్ష్మణ సమేత శ్రీకోదండరామస్వామి వారు సోమవారం కాళీయమర్దనం అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమాలను ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళీకృష్ణారెడ్డి పర్యవేక్షించారు. రామకృష్ణానగర్‌లోఉన్న కళ్యాణ వేంకటేశ్వరస్వామి సోమవారం జయలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ వారు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

● **రాజరాజేశ్వరిగా నాగవరప్పమ్మ**

కోవూరు : శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా కోవూరు గ్రామదేవత నాగ వరప్పమ్మ ఆలయంలో సోమవారం నాగవరప్పమ్మ రాజరాజేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతలుగా స్థానిక జంగంవీధి వాసులు వ్యవహరించారు. అర్చకుడు విశ్వనాథం సుబ్బరామయ్య భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

లలితాదేవి అలంకరణలో బాలాత్రిపురసుందరి

సైదాపురం, అక్టోబరు 7: స్థానిక బాలాత్రిపురసుందరీ దేవి ఆలయంలో సోమవారం అమ్మవారు లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

శ్రీకృష్ణ మందిరంలో పూజలు

వెంకటాచలం, అక్టోబరు 7 : వెంకటాచలంలోని రాధేరాధే కృష్ణ మందిరంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు, ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు చేశారు. భక్తులు విచ్చేసి రాధాకృష్ణులను దర్శించుకుని, తీర్థప్రసాదాలను స్వీకరించారు.

ధనలక్ష్మిగా దుర్గాదేవి

విడవలూరు, అక్టోబరు 7: స్థానిక పంచాయతీలో సోమవారం దుర్గాదేవి ధనలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కరెన్సీ నోట్లతో అమ్మణ్ణిని అలంకరించారు.

● **రాజరాజేశ్వరిగా దుర్గాదేవి**

మనుబోలు : సోమవారం కోదండరామపురంలో సరస్వతిదేవిగా, మనుబోలులో రాజరాజేశ్వరి అలంకరణలో దుర్గాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. కోదండరామపురంలో ఉభయదాతగా కందల సుమన్‌రెడ్డి, లక్ష్మీ దంపతులు, మనుబోలులో చెవికల పెంచలయ్యయాదవ్, రామాంజనేయుల యాదవ్ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

ఎమ్మెల్యే కురుగొండ్ల సహకారంతో గ్రామాల అభివృద్ధి

సైదాపురం, అక్టోబరు 7: ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సహకారంతో గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. సోమవారం మండల టీడీపీ అధ్యక్షుడు కట్టా మోహన్‌కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మండలంలో భూ సమస్యలు పరిష్కరించాలని సోమవారం స్థానిక తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందచేశారు. అనంతరం ఎంపీడీవో కార్యాల యంలో ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్‌కు మండల అభివృద్ధి పనులపై విన్నవించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొండూరు సుబ్రహ్మణ్యం రాజు, నలమారు వెంకటేశ్వర్లురెడ్డి, అమ్మినేని సుబ్రహ్మణ్యం నాయుడు, వరిగొండ సురేంద్ర, పాములూరు శ్రీనివాసులు నాయుడు, రాజశేఖర్ రాజు, కేపీ రాజు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచు, వార్డుసభ్యులకు శిక్షణ

తోటపల్లిగూడూరు, అక్టోబరు 7: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు మెంబర్లకు పంచాయతీ పాలనపై శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమానికి 22 గ్రామ పంచాయతీల సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు హాజరయ్యారు. పంచాయతీల పాలకులు గ్రామ పరిపాలనపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో తెలిపారు. శిక్షణాధికారిగా నరుకూరు పంచాయతీ కార్యదర్శి అజీజ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాపిరెడ్డిపాలెం ఉపసర్పంచు సీనయ్య, వార్డు సభ్యులు దద్దోలు మనోహర్, కొత్తపాలెం మాజీ సర్పంచు చేవూరు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

వందరోజుల కూటమి పాలనపై పాదయాత్ర

మనుబోలు, అక్టోబరు 7: వంద రోజుల కూటమి పాలనపై తెలుగునాడు ఉపాధ్యాయ ఫెడరేషన్ మాజీ నాయకుడు కంచర్ల మధుసూదన్‌రావు చేపట్టిన తిరుమల పాదయాత్ర సోమవారం మనుబోలుకు చేరుకుంది. వెంగమాంబ హోటల్ రాయల్ అధినేత శ్రీరామ్‌శెట్టి వెంకటేశ్వర్లు పాదయాత్రీకులకు స్వాగతం పలికారు.

మమ్మల్ని విధుల్లోకి తీసుకోండి సార్..! : వలంటీర్లు



తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న వలంటీర్లు

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 7: ఎన్నికల్లో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు తమను విధుల్లోకి తీసుకోవాలని పలువురు వలంటీర్లు కోరారు. రాష్ట్ర నేతల సూచన మేరకు సోమవరం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. అనంతరం తహసీల్దారు వెంకటేశ్వర్లుని, నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ చంద్రశేఖరరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఆపేసిన నాలుగు నెలల జీతాలను చెల్లించి, వలంటీర్లనందరినీ విధుల్లోకి తీసుకుని ఉద్యోగ భద్రతను కల్పించాలని కోరారు. కార్యక్రమంలో వలంటీర్ల యూనియన్ నాయకుడు కాలేషా, పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

బాలర్రాజ్ కాలువలో పూడికతీయండి



వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

నెల్లూరు(సిటీ), అక్టోబరు 7 : నెల్లూరు నగర శివారునున్న బాలర్రాజ్ కాలువలో పూడిక తీయ్యాలని 2వ డివిజన్ టీడీపీ నాయకులు ఎన్ఎంసీ అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం కార్పొరేషన్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకుడు మేకల అనిల్ మాట్లాడుతూ గుడిపల్లిపాడు వద్దనున్న నేతాజీనగర్ డ్రైనేజీ బయటకు వెళ్లేందుకు చిన్నచెరుకూరు క్రాస్‌రోడ్డు నుంచి సాయి, ఎస్ఎల్వీ లేఅవుట్ల మీదుగా నరుకూరు కూడలి వరకు పూడికతీయ్యాలన్నారు. బఫర్ జోన్లంటూ పూడికతీయ్యకుండా ఆపేస్తున్నారని చెప్పారు. అనంతరం నగరంలోని పలు డివిజన్లకు చెందిన ప్రజల నుంచి ఏడీసీ శర్మద వినతులు స్వీకరించారు.

'కాకాణీ.. వ్యక్తిగత విమర్శలు మానుకో'

ముత్తుకూరు, అక్టోబరు 7: సర్వేపల్లి ప్రజలు ఓటమితో గుణపాఠం చెప్పినా బుద్ధి తెచ్చుకోని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఇప్పటికైనా వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకుంటే మంచిదని సర్వేపల్లి నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బీ సురేష్‌నాయుడు హితవు పలికారు. ముత్తుకూరులో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సర్వేపల్లి ఎమ్మెల్యే చంద్రమోహన్‌రెడ్డిని వ్యక్తిగతంగా విమర్శించడం కాకాణి దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా పనికిమాలిన విమర్శలు ఆపకపోతే సర్వేపల్లి ప్రజలు తగిన గుణపాఠం నేర్పిస్తారన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు రహీం, సందూరి శ్రీహరి, రెహమాన్, చిన్న, తదితరులు పాల్గొన్నారు.

కొండలు మింగిన అనకొండ కాకాణి

● **టీడీపీ అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ**

నెల్లూరు(వైద్యం), అక్టోబరు 7: కొండలు మింగిన అనకొండ మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అని టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ ధ్వజమెత్తారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైసీపీ హయాంలో కాకాణి తవ్వించిన గ్రావెల్ గుంతలను సోమిరెడ్డికి అపాదించే కుట్రకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టులో ఫైళ్లు లేపేసిన గజదొంగ, నకిలీ డాక్యుమెంట్లు ముఠాలకు, కల్తీ మద్యం మాఫియాకు లీడర్‌గా ఉన్నారని విమర్శించారు. ప్రస్తుతం అధికారులను బ్లాక్ మెయిల్ చేసి నేరాల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో కాకాణి ఉన్నారని, ఎన్ని వేషాలు వేసినా చేసిన పాపాలకు శిక్ష తప్పదని హెచ్చరించారు. మా దళిత సోదరుడు ఉదయగిరి నారాయణ హత్య పాపం కూడా కాకాణిదేనన్నారు. కాకాణి చెంచాలు కూడా జైలుకు పోయే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు ఉయ్యాల జగన్మోహన్, ఉప్పు భాస్కర్‌రావ్, నందిపాటి ఇజ్రాయిల్, షేక్ రషీద్, వెంకటరమణ, సురేష్. పెంచలయ్య పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిగా గరుడయ్య

మనుబోలు, అక్టోబరు 7: పంచాయతీ కార్యదర్శిగా గరుడయ్య సోమవారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం తమ్మినపట్నం కార్యదర్శిగా ఉన్న గరుడయ్యను మనుబోలు కార్యదర్శిగా నియమించారు.

ప్రకటన

నా క్లయింట్ అయిన నారపనేని శ్రీనివాసులు తండ్రి లేట్ వీరాస్వామి, డోర్‌నెం. 23/678రు, సగిలవారి వీధి, ఫత్తేఖాన్‌పేట, నెల్లూరు నగరం అనువారు ఇచ్చిన వివరముల మేరకు ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా:- నా క్లయింట్ కొండాయపాలెం గ్రామం, సర్వేనెం. 383/1 & 384 ల్లోని వార్డు నెం. 26/1, డోరునెం. 1848రులో గల 75 అంకణములు లేక 501.675 చ.మీ. ఖాళీ స్థలమును బండ్ల విజయకుమార్ వగైరాల వద్ద నుండి రిజిష్టర్డు విక్రయ పత్రం తేది 25-08-2008 డాక్యుమెంట్ నెం. 9110/2008 ద్వారా కొనుగోలు చేసినారు. సదరు డాక్యుమెంటుకు సంబంధించిన ఒరిజినల్ లింకు డాక్యుమెంట్లలో ఒకటైన రిజిష్టర్డు సెటిల్‌మెంటు పత్రం తేది 01-12-1956 డాక్యుమెంట్ నెం. 3268/1956(SRO, NELLORE)రును కవర్‌లో పెట్టుకొని స్టోన్‌హౌస్‌పేటలోని బ్యాంక్ వద్దకు పోవుటకు నా క్లయింట్ తేది 01-10-2024న తన ఇంటి వద్ద నుండి బైక్‌లో వెళ్ళి ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో జిరాక్స్ తీసుకొని బ్యాంకుకు పోవుచుండగా మార్గమధ్యములో ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ పోయినది. సదరు ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ నెం. 3268/1956ను ఎవ్వరికైనను దొరికిన యెడల ఈ క్రింది అడ్రసుకు తెచ్చి ఇచ్చిన వారికి తగిన పారితోషం ఇవ్వబడును. సదరు ఒరిజినల్ లింకు డాక్యుమెంటును ఉపయోగించి ఎవ్వరైనా ఎట్టి లావాదేవీలు జరిపిన అవి చెల్ల నేరవు అవి నా క్లయింట్‌ను బద్ధగించవు.

షేక్ రియాజ్ బాషా, B.A.L., B.L., అడ్వకేట్, ఎస్‌బిఐ ఎదురుగా, అచారి వీధి, నెల్లూరు, సెల్ : 9393727765

శభాష్.. రామ్ !

● **చిన్నారిని సన్మానించిన కమిషనర్**



చిన్నారిని అభినందిస్తున్న కమిషనర్

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 7: నగర పంచాయతీ పరిధిలోని కోదండరామాపురంలో మూడేళ్ల చిన్నారి రామ్ నిత్యం ఆప్రాంతానికి చెత్త సేకరించే బండి రాగానే, ఇంట్లోని చెత్తను తీసుకొచ్చి పారిశుధ్య కార్మికులకు అందచేసేవాడు. విషయం తెలుసుకున్న నగర పంచాయతీ కమిషనర్ సోమవారం సిబ్బందితో కలిసి చిన్నారి నివాసానికి వెళ్లి రామ్‌ను సత్కరించారు. చిన్నతనం నుంచే ఇలాంటి మంచి అలవాట్లు కలిగి ఉండడం అభినందనీయమన్నారు. చిన్నారి రామ్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా, పారిశుధ్య కార్మికులకు అందజేయాలని కమిషనర్ కోరారు.



భాష మార్చుకో..

● **వైసీపీ నేత ఆనం విజయకుమార్‌రెడ్డికి టీడీపీ కార్పొరేటర్ల హితవు**

నెల్లూరు రూరల్, అక్టోబరు 7 : ఎన్నికల అనంతరం మూడు నెలలు పత్తాలేకుండా పోయిన ఆనం విజయకుమార్‌రెడ్డి వైసీపీ రూరల్ ఇన్‌చార్జి అయినవెంటనే నోటికొచ్చినట్లు మాట్లాడడం సమంజసం కాదని, ఇప్పటికైనా భాష మార్చుకొని పద్ధతిగా వ్యవహరించాలని పలువురు కార్పొరేటర్లు, టీడీపీ నాయకులు హితవు పలికారు. సోమవారం నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కార్పొరేటర్లు అశోక్‌నాయుడు, జానా నాగరాజు, పడిగినేటి రామ్మోహన్‌యాదవ్, మూలె విజయభాస్కర్ రెడ్డి, టీడీపీ నేతలు పిండి సురేష్, పాలకుర్తి రవి తదితరులు మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో సొంతూరైన చింతారెడ్డిపాళెంలో ఒక్క బూతులో కూడా మెజార్టీ తెచ్చుకోలేకపోయిన ఆయన ఎన్నికల్లో వైసీపీకి చెందిన పెద్ద వద్ద, ఆదాల వద్ద తీసుకున్న డబ్బులు ఎక్కడ పంచారో.. ఎవరికిచ్చావో చెప్పాలన్నారు. పార్టీ మారిన కార్పొరేటర్లను తాటతీస్తాం, తోలుతీస్తామంటే వింటూ ఊరుకోమన్నారు. ఎన్నికలు ముగిసిన తరువాత మూడు నెలల పాటు వైసీపీలో నాయకుడు లేక తామంతా అనేక ఇబ్బందులుపడ్డామన్నారు. ఎవరికి ఫోన్ చేసినా కనీసం పట్టించుకోలేదని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ మారినవారిని కొట్టుకుంటుపోతే ముందు నీదగ్గర్నుంచే మొదలుపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటరు ఒరిస్సా శ్రీనివాసులురెడ్డి, నాయకులు బెల్లంకొండ పెంచలనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ మత్స్య ఉత్పత్తులతో ఆరోగ్యం

● **మేయర్ స్రవంతి**

నెల్లూరు(వ్యవసాయం), అక్టోబరు 7 : ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు సముద్రపు ఆర్గానిక్ మత్స్య ఉత్పత్తులు ఎంతగానో దోహదపడతాయని మేయర్ స్రవంతి పేర్కొన్నారు. నెల్లూరు వీఆర్ కళాశాల మైదానంలో జరుగుతున్న 3వ ఆర్గానిక్ ఫుడ్ ఫెస్టివల్‌ను సోమవారం ఆమె సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా సముద్ర ఆహార ఉత్పత్తులకు మంచి ప్రచారం లభించినట్లయిందని చెప్పారు. మత్స్య, సేంద్రియ ఉత్పత్తులను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఆరోగ్యకరమైన ఆర్గానిక్ ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయని మన ప్రాంతాల్లో వారు వీటిపై అవగాహన పెంచేలా మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంక్షేమ సమితి జలనిధి ఫిషర్‌మెన్ స్టేట్ ఫెడరేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైష్ణవి కోలాట మండలి 12వ వార్షికోత్సవం

నెల్లూరు (సాంస్కృతికం), అక్టోబరు 7 : నగరంలోని పప్పులవీధిలోని జేసీ భవన్‌లో సోమవారం రాత్రి వైష్ణవి కోలాట మండలి 12వ వార్షికోత్సవం జరిగింది. అత్యధికంగా కార్యక్రమాల్లో పాల్గొన్న 22 మంది కోలాట కళాకారిణిలను మెమోంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కోలాట గురువు వెంకటలక్ష్మి, చీతిరాల పద్మావతి, కొల్లూరు ఝాన్సీ, కీర్తి, స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

సంఘాల మధ్య ఐక్యత ఉండాలి

బుచ్చిరెడ్డిపాళెం, అక్టోబరు 7: మెప్మా సంఘాల మధ్య ఐక్యత ఉండాలని నగర పంచాయతీ కమిషనర్ లింగారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. సోమవారం నగర పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన మెప్మా అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాఖ్యలోని లీడర్లు ప్రతి సంఘానికి సంబంధించిన రుణాలు, సకాలంలో చెల్లించేలా చూడాలన్నారు. ప్రతి ఇంటికీ ఒక మొక్క పంపిణీ చేస్తామన్నారు. ఆ మొక్కలను పెంచి ఇంటింటా ఆక్సిజన్ నింపే బాధ్యత మెప్మా సంఘాలదేనన్నారు. కార్యక్రమంలో సీవో నర్మద, డీఈవో సుజన, ఆర్పీ, ఎస్ఎల్ఎఫ్ పదాధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీద రవిచంద్రను కలిసిన బీఎస్ఎఫ్ నాయకులు

నెల్లూరు(హరనాథపురం), అక్టోబరు 7 : భారత సేవా ఫౌండేషన్ జిల్లా కార్యదర్శి షేక్ ఖాసీం, ఈసీ మెంబర్ కుసుమకుమారిలు సోమవారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఆగిపోయిన జాషువా గ్రంథాలయ నిర్మాణాన్ని పూర్తి చేయించాలని కోరారు. ఈ సందర్భంగా బీద రవిచంద్ర మాట్లాడుతూ మంత్రి నారాయణ, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఇతర ఎమ్మెల్యేలతో చర్చించి ఆగినపోయిన జాషువా భవన నిర్మాణ పనులను పూర్తి చేయిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్మల కృష్ణయ్య, జెన్ని రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

నిస్సాన్ మాగ్నెట్ కారు విడుదల



నూతన కారు విడుదల చేస్తున్న ప్రముఖులు

నెల్లూరు(సాంస్కృతికం), అక్టోబరు 7 : నగరంలోని మినీబైపాస్‌రోడ్డులో ఉన్న హైటెక్స్ నిస్సాన్ షోరూమ్‌లో సోమవారం రాత్రి నిస్సాన్ మాగ్నెట్ కారును ఎండీ జగన్నాథరెడ్డి మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కారులో అత్యాధునిక ఫీచర్స్ ఉన్నాయన్నారు. ఇందులో అమర్చిన 1.0 లీటర్ టర్బో ఛేంజెడ్ పెట్రోలు ఇంజన్ 98బీహెచ్‌పీ, 160 ఎన్ఎంటార్క్‌ను అందిస్తుందని, హైస్పీడ్ ఉంటుందన్నారు. ఈబీడీతో కూడిన ఏబీఎస్ కంట్రోలు వంటి భద్రతా ఫీచర్లు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు సీ.నిరంజన్, భారతి, హోషీమారెడ్డి, జనరల్ మేనేజర్ ఎస్‌వీఎస్ శాస్త్రి, సేల్స్ మేనేజర్ గోపి, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలుచుకున్న వారు, ప్రస్తుత చందాదారులకు పత్రిక పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ కింది ఫోన్ నెంబర్‌ను సంప్రదించగలరు.

నెల్లూరు ఏసీఎం - 9985411424

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక
ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755



కనరో.. కనులార స్వామిని!





కోరిన వరాలిచ్చే కల్పవృక్షమే స్వామికి వాహనంగా మారింది. బంగారు కాంతుల ధగధగల నడుమ మాడవీధుల్లో దేవేరులతో కలిసి వేణుగోపాల రూపుడై శ్రీనివాసుడు సోమవారం ఉదయం విహరించాడు. సాయంత్రం సకల దిక్కుల రాజులే స్వామికి వాహనమయ్యారు. సర్వభూపాల వాహనంలో కాళీయమర్దనుడై భక్తులకు దర్శనమిచ్చాడు. మంగళవారం నాడు స్వామి మెడలో అలరారడానికి శ్రీవిల్లిపుత్తూరు నుంచి గోదాదేవి మాలలూ, చెన్నై నుంచి 11 గొడుగులూ కూడా తిరుమలకు చేరుకున్నాయి. వందలాది మంది కళాకారుల నృత్యగానాలతో మాడవీధులు మనోహరంగా భాసిల్లాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

నేడే గరుడ సేవ

తిరుమల, అక్టోబరు 7 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఐదో రోజైన మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు గరుడ వాహన సేవ మొదలై రాత్రి 11.30 గంటల వరకు జరగనుంది. పెరటాశి మాసం చివరి వారం కావడంతో గరుడ సేవకు భక్తులు భారీగా వస్తారని టీటీడీ అంచనా వేస్తోంది. బ్రహ్మోత్సవాల్లో గరుడసేవకు విశిష్ట స్థానం ఉంది. ఆలయంలోని మూలవర్లకు అలంకరించే సహస్రనామమాల, లక్ష్మీహారం, మకరకంఠి, పచ్చ, సూర్యకఠారి, ప్రభుత్వం సమర్పించిన నూతన పట్టువస్త్రాలు తదితరాలతో గరుత్మంతుడిని అధిరోహించే మలయప్పకు అలంకరించడం విశేషం. చెన్నైకి చెందిన అంబ్రెల్లా చారిటీస్ సమర్పించే గొడుగులను ఉపయోగిస్తారు. అందుకే ఈ వాహనంలో మూలమూర్తి అవహించి భక్తులను అనుగ్రహిస్తారని ఐతిహ్యం. మహావిష్ణువుకు ప్రధాన వాహనమైన వైనతేయుడికి ఉత్సవాలలో అత్యంత ప్రాధాన్యముంది. మొదటి రోజున గరుడపటాన్ని ధ్వజస్తంభంపై ఎగరవేసి ఉత్సవాలు ప్రారంభం కావడమే దీనికి నిదర్శనం. అలాగే ముల్లోకాల దేవతలు కూడా గరుడసేవలో స్వామిని దర్శించడానికి వస్తారని పురాణోక్తి. ఇక, మంగళవారం ఉదయం మోహినీ రూపం ధరించి మలయప్పస్వామి దంతపల్లకీలో తిరువీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. తోడుగా శ్రీకృష్ణస్వామి మరో పల్లకీలో వేంచేస్తారు.

పెరిగిన రద్దీ

బ్రహ్మోత్సవాల్లో నాలుగు రోజుల నుంచి భక్తుల రద్దీ తక్కువగా ఉన్నప్పటికీ.. గరుడ సేవ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం నుంచి భక్తుల రాక పెరిగింది. రాత్రి జరిగిన సర్వభూపాల వాహనసేవలో గ్యాలరీలు నిండుగా కనిపించాయి. గదులు దొరక్క భక్తులు కార్యాలయాలు, దుకాణాల ముందు, ఫుట్‌పాత్‌లు, చెట్ల కింద సేదతీరారు.



చలిని లెక్క చేయక..


గరుడుడిపై గోవిందుడిని దర్శించుకోవాలన్న వారి కోరిక ముందు.. చలి కూడా చిన్నబోయింది. మంగళవారం సాయంత్రం జరిగే గరుడ సేవను వీక్షించడానికి సోమవారం రాత్రే భక్తులు గ్యాలరీల్లోకి చేరారు. చలిని లెక్కచేయకుండా గ్యాలరీలు, ఆలయం ముందు, అఖిలాండం వద్ద నిద్రించారు.



రాంభగీచ వద్ద ఏర్పాటు చేసిన క్యూలైన్

పూర్తయిన ఏర్పాట్లు

గరుడసేవకు సోమవారం సాయంత్రానికే ఏర్పాట్లు పూర్తిచేశారు. గ్యాలరీల్లోకి ప్రవేశం, నిష్క్రమణ సమయాల్లో తోపులాటలు, తొక్కిసలాట లేకుండా పటిష్ఠమైన బ్యారికేడ్లు, క్యూలైన్లు సిద్ధం చేశారు. తిరుమలతో దాదాపు 25 ప్రదేశాల్లో 9 వేల వాహనాలకు సరిపడా పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. పార్కింగ్ స్థలాలు నిండిపోతే వాహనాలను తిరుపతిలోనే ఆపేస్తారు. తిరుపతిలో అదనపు పార్కింగ్ స్థలాలను సిద్ధం చేశారు. తిరుమల ఘాట్‌రోడ్లలో సోమవారం రాత్రి 9 నుంచి బుధవారం ఉదయం 6 గంటల వరకు ద్విచక్రవాహనాల అనుమతిని రద్దు చేశారు. మాడవీధుల్లో మొబైల్ క్లినిక్‌లు, 12 అంబులెన్స్‌లు, వైద్యులు, పారామెడికల్ సిబ్బందిని ఏర్పాటు చేశారు. గ్యాలరీల్లోకి రాలేని భక్తులు గరుడ సేవను తిలకించడానికి 28 భారీ హెచ్‌డీ డిజిటల్ స్ర్కీన్లు ఉంచారు. దాదాపు ఏడు వేల మందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. 2,750 సీసీ కెమెరాలతో నిఘా పెట్టారు. గ్యాలరీల్లో దాదాపు 2 లక్షల మంది కూర్చునే అవకాశముంది. ఇన్నర్ రింగ్‌రోడ్డు, ఔటర్ రింగురోడ్డులో వేచిఉండే భక్తులను సుపథం, సౌత్ వెస్ట్ కార్నర్, గోవిందనిలయం నార్త్ వెస్ట్ కార్నర్, నార్త్ ఈస్ట్ గేట్ల ద్వారా అనుమతించి దర్శనం కల్పించనున్నారు.



అంకితభావంతో సేవలు అందించండి: ఈవో

గరుడసేవకు వచ్చే లక్షలాది మంది భక్తులకు అంకితభావంతో సేవలు అందించాలని టీటీడీ ఈవో శ్యామలరావు సూచించారు. గరుడసేవకు డిప్యుటేషన్‌పై నియమితులైన ఉద్యోగులతో సోమవారం సాయంత్రం తిరుమల ఆస్థానమండపంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 'నాలుగు మాడవీధుల్లోని 183 గ్యాలరీల్లో ప్రణాళికబద్ధంగా ఏర్పాట్లు చేశాం. గ్యాలరీల్లోని భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించేందుకు ఒక కో-ఆర్డినేటర్‌ను నియమించాం. మీరు పరిష్కరించలేని సమస్యలుంటే వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయండి. సమన్వయం, సమష్టి కృషి ముఖ్యం' అని పేర్కొన్నారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి మాట్లాడుతూ.. మెరుగైన సమన్వయంతో భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సేవలు అందించేందుకు మాడవీధుల్లో 563 మందిని నియమించామన్నారు. విధుల్లో 360 మంది సహాయక సిబ్బందినీ ఏర్పాటు చేశామన్నారు. జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కోసం వస్తే చంపేస్తాం!

శ్రీకాళహస్తిలో సెక్యూరిటీ కాంట్రాక్టరుపై దౌర్జన్యం

శ్రీకాళహస్తి, అక్టోబరు 7: 'ఎవడ్రా నువ్వు. ఎక్కడో సికింద్రాబాద్ నుంచి వచ్చి మా ఊర్లో టెండరు వేస్తావా? నీ అంతు చూస్తాం. మర్యాదగా పత్రాలు చేతికిచ్చి పారిపో. లేదంటే చంపేస్తాం' అంటూ ఓ సెక్యూరిటీ కాంట్రాక్టర్‌పై కొందరు కూటమి నేతలు దౌర్జన్యానికి పాల్పడిన ఘటన సోమవారం శ్రీకాళహస్తిలో జరిగింది. సికింద్రాబాద్‌కు చెందిన మయూరి సెక్యూరిటీస్ సర్వీసెస్ సంస్థ నిర్వాహకుడి కథనం మేరకు.. ఈ సంస్థ తరఫున 2021-22లో ముక్కంటి ఆలయంలో సెక్యూరిటీ కాంట్రాక్టు నిర్వహించారు. ఈ ఏడాది జూలైలో ఆన్‌లైన్ ద్వారా మళ్లీ సెక్యూరిటీ టెండర్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తు పత్రాలను నేరుగా సమర్పించే సమయంలో కొందరు ఇబ్బంది పెట్టడంతో ఇవ్వలేదు. దాంతో అప్పట్లో టెండర్ రద్దయింది. మళ్లీ గతనెల 20న ముక్కంటి ఆలయంలో సెక్యూరిటీ కాంట్రాక్టు కోసం అధికారులు ఆన్‌లైన్ ద్వారా టెండర్లను ఆహ్వానించారు. దరఖాస్తు చేసుకున్న కాంట్రాక్టర్లు సోమవారం సాయంత్రంలోగా ఆలయంలోని అధికారులకు ఒరిజినల్ పత్రాలను సమర్పించాలి. దీనికోసం మయూరి సెక్యూరిటీస్ సర్వీసెస్ సంస్థ నిర్వాహకుడు ఆలయం వద్దకు వచ్చారు. పరిపాలనభవనం వద్ద కాపుకాసిన నలుగురు కూటమి నేతలు అతడిని అడ్డుకున్నారు. ఆలయ ఓ సూపరింటెండెంట్ సమక్షంలోనే కాంట్రాక్టరు చేతిలోని సెల్‌ఫోన్ లాక్కుని దుర్భాషలాడారు. బ్యాగులో ఉన్న పత్రాలను గుంజుకునేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో తోపులాట జరిగింది. తాను దేశ రక్షణ కోసం 20 ఏళ్లపాటు ఆర్మీలో సేవలందించానని, గతంలో ఈ ఆలయంలో ఇదే కాంట్రాక్టును చిన్న మచ్చలేకుండా నిర్వహించానని ఆయన చెప్పారు. ఇలా పత్రాలు సమర్పించకుండా దౌర్జన్యానికి పాల్పడటం ఏమిటని కాంట్రాక్టరు ఆవేదన వ్యక్తంచేశారు. ఇలా బయటివారు టెండరు దాఖలు చేసేందుకు వీల్లేనప్పుడు ఆన్‌లైన్ ద్వారా ఎందుకు టెండర్ నోటీసులు ఎందుకు ఇచ్చారని ప్రశ్నించారు. కాగా, తన చేతిలోని సంచిని లాక్కునేందుకు తోపులాట జరగడంతో ఆలయంలోని పోలీస్‌అవుట్‌పోస్టు వద్ద రక్షణ కోసం వెళ్లి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. అక్కడా పోలీసుల సమక్షంలోనే కూటమి నేతలు బూతులు తిట్టడంతో తాను భయాందోళనతో వచ్చేశాననని చెప్పారు. ఇదంతా సీసీ కెమెరాల్లోనూ నిక్షిప్తమైనట్లు సమాచారం.

ఎకరాకు రూ.10లక్షలు ఇస్తేనే..!

ప్రభుత్వ భూములిస్తామంటూ కొత్తపట్నం గ్రామసభలో రైతుల అల్టిమేటం

కోట, అక్టోబరు 7: 'ఏళ్ల తరబడి ప్రభుత్వ భూములను సాగుచేసుకొని జీవిస్తున్నాం. ఇప్పుడు ఆ భూములను ఇవ్వాలంటే ఎకరాకు రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలి' అంటూ రైతులు తేల్చిచెప్పారు. చెన్నై, బెంగళూరు ఇండస్ట్రియల్ కోస్టల్ కారిడార్‌కు భూములు కోల్పోయే రైతులకు సోమవారం కోట మండలం కొత్తపట్నంలో అధికారులు గ్రామసభ నిర్వహించారు. ప్రస్తుతానికి ఈ పంచాయతీలో 310 ఎకరాలను గుర్తించామని, ఎకరాకు రూ.నాలుగు లక్షల పరిహారం ఇచ్చేలా ప్రయత్నిస్తామని, అది కూడా గట్టిగా చెప్పలేమని రెవెన్యూ అధికారులు తెలిపారు. దీంతో 2021లో కొత్తపట్నం పంచాయతీలో సెటిల్‌మెంట్ భూమి ఎకరాకు 21.75 లక్షలు ఇచ్చారని, ఇప్పుడు రూ.30 లక్షలు ఇస్తూ దానికి సమానంగా డీకేటీ భూమికి కూడా పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. అలాగే, ప్రభుత్వ భూములకు ఎకరాకూ రూ.4 లక్షలు కాకుండా రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండు చేశారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం మార్గం చూపుతానని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీన రైతులకు సర్ది చెప్పారు. చిల్లకూరు మండలం తమ్మినపట్నంలో జరిగిన గ్రామసభలోనూ రైతులు.. తాము సాగుచేసుకుంటున్న ప్రభుత్వ భూములు వదలాలంటే రూ.10లక్షల పరిహారం చెల్లించాలన్నారు.

ఒక్క రోజే 390 టెండర్లు

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 7: జిల్లాలోని 227 మద్యం దుకాణాలకు సోమవారం ఒక్కరోజే దాదాపు 390 టెండర్లు దాఖలయ్యాయి. ఈ లెక్కన ఏడు రోజుల వ్యవధిలో మద్యం షాపులకు 600 టెండర్లు దాఖలు అయినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి తెలిపారు. మరో రెండు రోజుల వ్యవధిలో కనీసం 20,000 దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.



కత్తితో దాడి కేసులో నలుగురి అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న సీఐ శేఖర్‌బాబు

గూడూరు, అక్టోబరు 7: పట్టణంలో ఈనెల 3వ తేదీ రాత్రి జెండా పండుగ సందర్భంగా రెండు వేర్వేరు ఘటనల్లో కత్తితో దాడిచేసిన నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు ఒకటో పట్టణ సీఐ శేఖర్‌బాబు తెలిపారు. సోమవారం ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్థానిక కృష్ణమందిరం వీధికి చెందిన అబ్దుల్ రెహమాన్, అతని స్నేహితుడు భాస్కర్‌తో కలిసి జెండా పండుగ నాడు శివాలయంవీధి వద్ద ఉండగా పాతకక్షలతో ఇమ్మానియేలు గొడవపడ్డాడు. అబ్దుల్ రెహమాన్ వారించగా అతడిపై శ్రీనాథ్ అనే యువకుడు కత్తితో దాడిచేశాడు. ఈ కేసులో నిందితులైన పట్టణానికి చెందిన శ్రీనాథ్, ఇమ్మానియేలు, వెంకటేశ్వర్లును సోమవారం స్థానిక తాళమ్మగుడి సమీపంలో అరెస్టు చేయడం జరిగిందన్నారు. అదేరోజు చిన్నమసీదు వద్ద జెండా ఊరేగింపు జరుగుతున్న సమయంలో జరిగిన తోపులాటలో హరీష్, యశ్వంత్‌పై పట్టణానికి చెందిన మనోజ్, ఓ మైనర్ యువకుడు కత్తితో దాడిచేసి గాయపరిచారు. ఈ కేసులో నిందితులు ఇద్దరిని స్థానిక రైల్వే పార్శిల్ కార్యాలయం వద్ద అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ తిరుమలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు ఎక్కడ: ఎంపీపీ

వెంకటగిరిటౌన్, అక్టోబరు 7: మండలంలో ఎక్కడా ఉపాధి పనులు జరడం లేదని ఎంపీపీ తంబిరెడ్డి తనూజా రెడ్డి అధికారులను నిలదీశారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మేట్‌లకు జీతాలు ఇవ్వకపోవడంతో వారు అవినీతికి పాల్పడుతున్నారని తెలిపారు. ఉపాధి కూలీలు పనులు వెతుక్కోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియర్ మేట్‌లు లేరని ఏపీవో సమాధానం చెప్పడంతో గత ఏడాదిగా ఉపాధి పనులు జరగడం లేదని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీవో జోక్యం చేసుకోవడంతో గ్రామాల వారిగా ఉపాధి పథకాలు కల్పిస్తామని చెప్పారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. కాగా, టీడీపీ నాయకుడు తోట రామచంద్రయ్య అధికారులతో స్టేజీపై కుర్చోవడంతో చర్చనీయాంశంగా మారింది.

తమ్మినపట్నంలో గ్రామసభ


సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ రాఘువేంద్ర మీనా

చిల్లకూరు, అక్టోబరు 7: మండలంలోని తమ్మినపట్నం గ్రామంలో సోమవారం సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ తమ్మినపట్నం, గుమ్మళ్లదిబ్బ, లింగవరం, తాళ్లబైట, గోనుగుంట గ్రామాల్లోని రైతులు సాగుచేసుకుంటున్న 914 ఎకరాల ప్రభుత్వ భూములను సర్వే చేసి సాగుదారుల వివరాలు వెల్లడించామన్నారు. ఎకరాకు రూ.4.40లక్షలు పరిహారం చెల్లించడం జరుగుతుందన్నారు. అలాగే 5 ఎకరాల భూమి ఉన్న కొంతమంది పేర్లను తొలగించడం జరిగిందని, అందుకు సంబంధించి అభ్యంతరాలను తెలపాలన్నారు. గ్రామస్థులు మాట్లాడుతూ తమకు ఎకరాకు రూ.10లక్షల వరకు పరిహారం చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీనివాసులు, గూడూరు, చిట్టమూరు, వాకాడు మండలా డిప్యూటీ తహసీల్దార్లు సురేంద్ర, విజయలక్ష్మి, నిరంజన్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్ అభివృద్ధికి కృషి చేయండి


విజయశ్రీ దంపతులకు సన్మానిస్తున్న వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

నాయుడుపేట, అక్టోబరు 7: నాయుడుపేట రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ పథకం కింద అభివృద్ధి చేసేలా చూడాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీకి సదరన్ రైల్వే ప్యాసింజర్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు ఎమ్మెల్యే విజయశ్రీ, పార్థసారధి దంపతులను సత్కరించారు. కోవిడ్ సమయంలో నిలిపివేసిన హైదరాబాదు సూపర్ ఫాస్ట్, డెహరాడూన్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలుపుదల చేయాలని, అలాగే చెన్నై నుంచి సూళ్లూరుపేట వరకు వచ్చే అన్ని మెమో రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించేందుకు కృషి చేయాలని కోరారు. ఇందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో సదరన్ రైల్వే ప్యాసింజర్ వెల్ఫేర్ అసోసియేషన్స్ సభ్యులు మస్తానయ్య, రవి, జోసెఫ్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజేతలకు అభినందన

కోట, అక్టోబరు 7: మోహనమంత్ర హాకథాన్‌లో ప్రతిభ చూపిన ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ విద్యార్థులను కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి అభినందించారు. ఈనెల 4నుంచి 6వ తేదీ వరకు తిరుపతిలోని మోహన్‌బాబు విశ్వవిద్యాలయంలో జరిగిన కోడింగ్ హాక్‌థాన్‌లో 183 టీమ్‌లు పాల్గొన్నాయి. ఇందులో కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు నిమ్మల జశ్వంత్, రేణుక, నందిని, జోష్న కోడింగ్‌లో పాల్గొని మొదటస్థానాన్ని కైవశం చేసుకున్నారు. వీరికి మోహన్‌బాబు విశ్వవిద్యాలయం రూ.35వేల నగదు బహుమతి అందజేసింది. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డితో పాటు డాక్టర్ రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ నారాయణరావు, పలు విభాగాదిపతులు షీల్డులు, మెమెంటోలతో విద్యార్థులను అభినందించారు.

ప్రణాళికా బద్ధంగా సర్వే చేయాలి

బాలాయపల్లి, అక్టోబరు 7: గత ప్రభుత్వ హయాంలో ఫ్రీహోల్డ్ చేసిన అసైన్‌మెంట్ భూములను ప్రణాళికా బద్ధంగా సర్వే చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్రీహోల్డ్ అయిన ప్రతి సర్వే నంబరు రికార్డుల్లో ఎవరి పేరున నమోదై ఉంది, ఎవరు సాగు చేస్తున్నారో వివరాలను పరిశీలించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ శిరీష తదితరులు పాల్గొన్నారు.

జీవరాశులను కాపాడుకుందాం: డీఎఫ్‌వో

దొరవారిసత్రం, అక్టోబరు 7: మానవాళికి అనేక రకాలుగా ఉపయోగపడుతున్న జీవ రాశులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూళ్లూరు పేట వన్యప్రాణి సంరక్షణ విభాగం డీఎఫ్‌వో హారిక అన్నారు. వన్యప్రాణి వారోత్స వాల్లో భాగంగా నేలపట్టు పక్షుల కేంద్రంలో సోమవారం బయోడైవర్సిటీపై పులికాట్, నేలపట్టు రేంజ్‌ల పరిధిలోని అటవీశాఖ సిబ్బంది, గైడ్స్‌కు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీవరాశులను కాపాడు కోవడంలో వన్యప్రాణి సంరక్షణశాఖ అధికారులు, సిబ్బంది పాత్రపై రాష్ట్ర బయోడైవర్సిటీ బోర్డు సభ్యుడు, రిటైర్డ్ డీఎఫ్‌వో ఖాదర్‌వల్లీ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. వన్యప్రాణి వారోత్సవాల పోస్టర్స్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో రేంజర్ సౌజన్య, ఎఫ్‌ఎస్‌వో బాలయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళకు కుట్టుమిషన్ అందజేత

గూడూరు అర్బన్, అక్టోబరు 7: స్థానిక ముత్తూట్ మినీఫైనాన్స్ కార్యాలయంలో సోమ వారం ఓ మహిళకు కుట్టుమిషన్ అంద జేశారు. ఆ సంస్థ తిరు పతి ఏరియా మేనేజర్ గోపినాధ్ మాట్లాడుతూ తమ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా స్థానిక మాళవ్యానగర్‌కు చెందిన ఈశ్వరికి కుట్టుమిషన్ అందజేశామని తెలిపారు.

డీఆర్‌డీఏ పీడీ బాధ్యతల స్వీకరణ


శోభన్‌బాబు

తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు7: డీఆర్‌డీఏ పీడీగా టీఎన్ శోభన్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా నగరి క్లస్టర్ డ్వామా పీడీగా ఉన్న ఆయనను తిరుపతి జిల్లా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. ముందుగా ఆయన కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి డీఆర్‌డీఏ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.


నాయుడుపేట టౌన్: అన్నపూర్ణాదేవిగా మూకాంబికాదేవి


కోట: గాయత్రీదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి


కోట: మహాచండి అలంకారంలో రామలింగచాముండేశ్వరి


సూళ్లూరుపేట: సారె తీసుకెళ్తున్న ఆర్యవైశ్యులు


గూడూరు: రక్తబీజవధ అలంకరణలో ద్రౌపదీదేవి, రజతకవచ అలంకరణలో విజదుర్గాదేవి, లలితాదేవిగా గంగమ్మ - సూళ్లూరుపేట: అష్టకాళిగా చెంగాళమ్మ

ఆకట్టుకున్న అమ్మవార్ల అలంకారాలు

గూడూరు, అక్టోబరు 7: పట్టణంలో దేవిశరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం పలు ఆలయాల్లో అమ్మవార్లను వివిధ అలంకరణల్లో ముస్తాబు చేయడంతో భక్తులను ఆకట్టుకున్నాయి. స్థానిక సాయిసత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో అమ్మవారిని రజత కవచంతో అలంకరించారు. నారాయణమ్మ పేరంటాళ్ల ఆలయంలో అమ్మవారిని, రాజరాజేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని మహాచండీదేవి అలంకారంలో, కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని విజయలక్ష్మీదేవిగా, గంగమ్మ ఆలయంలో అమ్మవారిని లలితాదేవిగా, ధర్మరాజస్వామి ఆలయంలో ద్రౌపదిదేవిని రక్తబీజ వధ అమ్మవారి అలంకారంలో, బజారుకలశంలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మను సోమవారం ఉదయం కాసుల అలంకారంలో ఉంచి పూజలు జరిపారు. రాత్రికి మహాలక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించి అర్ధరథంపై గ్రామోత్సవం జరిపారు. కలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవి అమ్మవారిని గజలక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారిని కంచి కామాక్షీదేవిగా, మూలవిరాట్‌కు ఏకవీర దేవి అలంకారం, హరహర క్షేత్రంలోని కాత్యయనీ దేవికి కామాక్షీదేవి అలంకారం, వెంకటేశ్వర స్వామిని వామన అవతారంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

సూళ్లూరుపేట: చెంగాళమ్మ పరమేశ్వరి అష్టకాళిగా భక్తులకు దర్శనమిచ్చారు. సోమవారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని యాగశాల మండపంలో అమ్మవారి ఉత్సవ విగ్రహం ఏర్పాటు చేసి మహాచండీయాగం నిర్వహించారు. గాండ్లవీధి, కచ్చేరి, బాపూజి, పార్కువీధివాసులు అమ్మవారికి సారె సమర్పించారు. చండీయాగానికి మాదరపాక జగన్మోహన్, గౌరి, అలంకార ఉభయకర్తలుగా ముద్దాలి శరణ్‌కుమార్‌రెడ్డి, లక్ష్మీప్రియారెడ్డి దంపతులు వ్యహరించారు. అలాగే కన్యకాపరమేశ్వరి అమ్మవారికి ఆర్యవైశ్యులు పసుపు, కుంకుమ, గాజులు, పూలమాలతో సారె సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారు గాయత్రీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా నాగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు బాలత్రిపురసుందరి దేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని మూకాంబికాదేవి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అలాగే మానసాదేవి, దుర్గాదేవి, పోలేరమ్మ, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లో శరన్నవరాత్రి పూజలు జరిగాయి.

కోట: మండల పరిధిలోని గూడలిలో రామలింగ చాముండేశ్వరి అమ్మవారిని మహాచండీ అలంకారంలో ఉంచగా, ఆలయ ధర్మకర్త హాస్యం శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అదేవిధంగా కోటలోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని గాయత్రిదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.


వెంకటగిరి టౌన్: రాజరాజేశ్వరిగా కన్యకాపరమేశ్వరి, మూలవిరాట్‌కు ఏకవీరదేవి అలంకారం - చిల్లకూరు: కాసుల అలంకారంలో ముత్యాలమ్మ, గజలక్ష్మీదేవిగా ఆదిలక్ష్మీదేవి

తహసీల్దార్‌గా శ్రీనివాసులు

బాలాయపల్లి, అక్టోబరు 7: బాలాయపల్లి తహసీల్దార్‌గా పూజారి శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న తహసీల్దార్ ప్రసాద్ రావు కలెక్టరేట్‌కు, అక్కడున్న శ్రీనివాసులు బాలాయపల్లికి బదిలీ అయ్యారు.

ఎంపీడీవోగా మధుసూదనరావు



గూడూరు అర్బన్, అక్టోబరు 7: గూడూరు ఎంపీడీవోగా మధుసూదనరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు నెల్లూరు జిల్లా తోటపల్లి గూడూరుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో అనంతసాగరంలో పనిచేస్తున్న మధుసూదనరావు నియమితులయ్యారు. ఆయనకు సిబ్బంది అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సూళ్లూరుపేట, అక్టోబరు 7: సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సూళ్లూరుపేట పట్టణంలోని అన్ని ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఏ శేఖర్ తెలిపారు.

రెండు దుకాణాల్లో చోరీ

నాయుడుపేట టౌన్, అక్టోబరు 7: పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలో గల రెండు దుకాణాల్లో చోరీ జరిగింది. బార్బర్ దుకాణంలో రూ.2వేల నగదు, సామగ్రి చోరీ చేశారు. ఆ నక్కనే ఉన్న శీతలపానీయం దుకాణంలో రూ.5వేల నగదు చోరీ అయినట్లు బాధితులు తెలిపారు.

గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం

పెళ్లకూరు, అక్టోబరు 7: మండలంలోని పంచాయతీల అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీవో ప్రమీలారాణి కోరారు. సోమవారం బాధ్యతలు చేపట్టిన ఆమెను టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సత్కరించారు.

ప్రమాదవశాత్తు బాలుడి మృతి

చినగంజాం, అక్టోబరు 7: ప్రమాదవశాత్తు ఆటో ప్రమాదంలో బాలుడు మృతి చెందిన ఘటన ప్రకాశం జిల్లా చిన గంజాం మండలంలోని రాజుబంగారపాలెంలో రామాలయం వద్ద సోమవారం చోటుచేసుకుంది. తిరుపతి జిల్లా బాలయ్యపల్లి మండలం జయంపు గ్రామానికి చెందిన వెంకటేష్ 10సంవత్సరాలుగా చినగంజాంలోని అంబేడ్కర్‌నగర్‌లో నివాసముంటున్నారు. వెంకటేష్‌కు భార్య సుజాతకు రెండు నెలల కిందట చిన్నపాటి గొడవలు జరిగి భార్య పుట్టింటికి వెళ్లింది. కుమారుడు శ్యాంజీవన్(7), కుమార్తె వెంకటేష్ దగ్గరే ఉంటున్నారు. రాజబంగారపాలెంకు చెందిన ఆటోడ్రైవర్ మురళీరెడ్డి, వెంకటేష్ స్నేహితుడు. వెంకటేష్ కుమారుడు శ్యాంజీవన్ సోమవారం మురళీరెడ్డి వాళ్ల పిల్లలతో ఆడుకునేందుకు వెళ్లగా, తిరిగి శ్యాంజీవన్‌ను వాళ్ల ఇంటి దగ్గర వదిలిపెట్టేందుకు మురళీరెడ్డి తన ఆటోను స్టార్ట్‌చేసి ఉంచి ఇంట్లోకి వెళ్లి వచ్చేలోగా శ్యాంజీవన్ చేతులు గేర్‌కు తగలడంతో ఆటో ఎదురుగా ఉన్న భవనం గోడను ఢీకొట్టింది. శ్యాంజీవన్‌కు గోడ బలంగా తగలడంతో ముక్కు, నోటి నుంచి తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే 108లో చీరాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే శ్యాంజీవన్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఎరువుల విక్రయాల్లో నిబంధనలు పాటించాలి

సూళ్లూరుపేట, అక్టోబరు 7: ఎరువుల విక్రయాల్లో డీలర్లు నిబంధనలు తప్పకుండా పాటించాలని వ్యవసాయ సహాయ సంచాలకురాలు అనిత అన్నారు. సోమవారం ఆమె ఎరువులు, విత్తనాలు, పురుగుమందుల డీలర్లతో సమావేశం నిర్వహించారు. రైతులకు ఇబ్బంది లేకుండా యూరియా, డీఏపీ అందుబాటులో ఉండాలన్నారు. నాణ్యమైన విత్తనాలు అందించాలన్నారు.

వైసీపీ ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం: దువ్వూరు


రాజీనామా లేఖలు చూపుతున్న వైసీపీ నాయకులు

వాకాడు, అక్టోబరు 7: గత ప్రభుత్వంలో అన్ని విధాలా నష్టపోయామని, ముఖ్యంగా తీరప్రాంతంలోని పంచాయతీలను అభివృద్ధి చేయకుండా విస్మరించారని వైసీపీ నాయకుడు దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని రావిగుంటపాళెం, నిడిగుర్తి, మూలపడవ, పూడిరాయదొరువు పంచాయతీల వైసీపీ నాయకులు సోమవారం పార్టీ సభ్యత్వానికి మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ సందర్భంగా అజిత్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ తీరప్రాంత గ్రామాలను వైసీపీ ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని నమ్మి మోసపోయామన్నారు. తీరప్రాంతాలకు తెలుగుగంగ జలాలను తీసుకురాలేదని, రైతులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని చెప్పి పట్టించుకోలేదన్నారు. రావిగుంటపాళెం నుంచి పూడిరాయదొరువు వరకు అధ్వానమైన రోడ్లను అభివృద్ధి చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ఇలా తీరప్రాంతంలో అభివృద్ధి శూన్యం కావడంతో విసుగుచెంది నాలుగు పంచాయతీల నాయకులతో పాటు ఎంపీటీసీ శోభన, రావిగుంటపాళెం, నిడిగుర్తి సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు మూకుమ్మడిగా వైసీపీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలో భవిష్యత్తు ప్రణాళికలను ప్రకటిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నిడిగుర్తి సర్పంచు మల్లాపు నాగరాజు, రావిగుంటపాళెం సర్పంచు, ఎంపీటీసీ శోభన, నింగిలాల వేణు, ఇంగిలాల వెంకటాద్రి, కోట రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చదివింది తొమ్మిదో తరగతి

ఇస్రోలో ఉద్యోగినంటూ నాలుగు పెళ్లిళ్లు

ఐదో పెళ్లికి సిద్ధం ● బాధితురాలి ఫిర్యాదుతో కటకటాలు

సహకరించిన మరో ఇద్దరి అరెస్టు

ఏలూరు క్రైం, అక్టోబరు 7: ఆన్‌లైన్‌లో మేట్రిమోని ప్రొఫైల్‌లో ఫోన్ నెంబర్లను సేకరించి మాయమాటలతో నలుగురు యువతులను పెళ్లిచేసుకుని ఐదో యువతిని పెళ్లి చేసుకోవడానికి ప్రయత్నించిన వ్యక్తితో పాటు అతనికి సహకరించిన మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపారు. ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ సోమవారం కేసు వివరాలను వెల్లడించారు. తిరుపతి జిల్లాకు చెందిన ఆశం అనిల్‌బాబు అలియాస్ కల్యాణ్‌రెడ్డి(36) ప్రస్తుతం తెలంగాణా రాష్ట్రం ఖమ్మం జిల్లా మధిరలోని టీచర్స్ కాలనీలో ఉంటున్నాడు. 9వ తరగతి వరకూ చదివి చిన్నచిన్న ఉద్యోగాలు చేస్తూ వచ్చాడు. ఎక్కువ డబ్బు సంపాధించాలని ఆలోచించి మేట్రిమోని వెబ్‌సైట్‌లో కల్యాణ్‌రెడి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించాడు. వెబ్‌సైట్ ద్వారా సేకరిచిఇన నెంబర్లకు ఫోన్ చేసి తాను కల్యాణ్‌రెడ్డి (అనిల్ బాబు) తండ్రిని మాట్లాడుతున్నానని పరిచయం చేసుకునేవాడు. తమ కుమారుడు ఇస్రోలో హెచ్‌ఆర్‌గా పనిచేస్తున్నాడని, తన భార్య కూడా ఇస్రోలో ఎలక్ట్రికల్ ఇంజనీర్ అని చెప్పేవాడు. తన అల్లుడు, కూతురు అమెరికాలో ఉంటున్నారని, తమకు వంద ఎకరాల వ్యవసాయభూమి, రెండు విల్లాలు ఉన్నాయని, కట్నకానుల పట్టింపులేదని, అమ్మాయి నచ్చితే చాలని నమ్మబలికేవాడు. ఆ తరువాత అనిల్ అలియాస్ కల్యాణ్‌రెడ్డి నేరుగా పెళ్ళిచూపులకు వెళ్లేవాడు. పెళ్లి కూతురు నచ్చిందని వారి కుటుంబ సభ్యులు వివరాలు అడిగి తెలుసుకునేవాడు. ఇస్రోలో తాను హెచ్‌ఆర్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నాని, ఉద్యోగాలు ఇప్పిస్తానని సొమ్ములను తన అకౌంట్‌లోకి వేయించుకునేవాడు. హైదరాబాద్ శివారు చేవెళ్లలో ఒక ఫామ్‌హౌస్, బెంగళూరులో ఒక విల్లాను అద్దెకు తీసుకున్నాడు. హైదరాబాద్‌లో ఒక పీఏ, ఒక వాచ్‌మెన్, ఒక యువతి అసిస్టెంట్‌గా పెట్టుకుని ఇద్దరు బౌన్సర్లను కూడా పెట్టుకున్నాడు. ఇతనికి సలహాలు ఇవ్వడానికి కాశీ అనే వ్యక్తి పెళ్ళి చేయడానికి కూడా పంతులను ఏర్పాటు చేసుకున్నాడు. ఈ రకంగా నలుగురు యువతులను పెళ్ళి చేసుకుని మోసగించాడు. భీమడోలు మండలం గుండుగొలను గ్రామానికి చెందిన ఒక యువతికి పెళ్ళి సంబంధం చూసే నిమిత్తం వెబ్‌సైట్లో వివరాలు పెట్టడంతో వెంటనే అనిల్‌బాబు ఇదే విధంగా వారితో సంభాషణలు కలిపి వారి కుమార్తెను పెళ్ళి చేసుకుంటానని మూడో కుమార్తెకు ఇస్రోలో ఉద్యోగం ఇస్తానని నమ్మబలికి ఆన్‌లైన్ ద్వారా ఏకంగా రూ.9 లక్షల 53 వేలు తీసుకుని మోసగించాడు. ఉద్యోగం ఇంటర్వ్యూ కోసం తన వద్ద పనిచేసే తుంగా శశాంక అనే యువతితో నకిలీ ఇంటర్వ్యూలు చేయించి ఉద్యోగానికి అపాయింట్‌మెంటు ఆర్డర్లను కూడా ఇస్తూ మోసగిస్తున్నాడు. బాధితులు మోసపోయామని గ్రహించి భీమడోలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ప్రధాన నిందితుడు అనిల్‌బాబు అలియాస్ కల్యాణ్‌రెడ్డి, అతనికి సహకరించిన కడప జిల్లా ఎర్రగుంట్ల మండలం కాలమాల గ్రామానికి చెందిన తుంగా శశాంక (27) నంద్యాల జిల్లా బనగానపల్లి మండలం బత్తులూరుపాడు గ్రామానికి చెందిన పల్లె హేమంత్‌రెడ్డిలను అరెస్టు చేశారు.

టీడీపీ నేతల సహకారంతో రోడ్లకు మరమ్మతులు


రోడ్డుకు మరమ్మతులు చేయిస్తున్న టీడీపీ నాయకులు


కోట, అక్టోబరు 7: కోట పట్టణంలోని పలు సెంటర్లలో దెబ్బతిన్న రోడ్లకు సోమవారం టీడీపీ నాయకులు సొంత నిధులతో తాత్కలిక మరమ్మతులు చేశారు. పట్టణంలోని ఆర్టీసీ సెంటర్ నుంచి గోపాల్‌రెడ్డి విగ్రహం వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతిని గోతులమయంగా మారింది. ఆ మార్గంలో పాదచారులు, వాహన చోదకులు, బస్సులు వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. టీడీపీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ సొంత నిధులతో టిప్పర్ల ద్వారా కంకర్‌ను తెప్పించి గోతులను పూడ్చి వేయించారు. మాజీ ఎంపీపీ మాణికల పవన్‌కుమార్, తీగల సురేష్‌బాబు, ఎంపీటీసీలు దారా సురేష్, షంషుద్దీన్, నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో రోడ్లకు తాత్కలిక మరమ్మతులు చేపట్టారు. ఇందుకు ప్రోత్సహించిన ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు టీడీపీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యతోనే పేదరిక నిర్మూలన


గ్రామసభలో సమస్యలను విన్నవిస్తున్న గిరిజన మహిళలు

దొరవారిసత్రం, అక్టోబరు 7: విద్యతోనే పేదరిక నిర్మూలన సాధ్యమని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ అన్నారు. సోమవారం ఆయన దొరవారిసత్రం మండలం కొత్తపల్లి కలుజుమిట్ట గిరిజన కాలనీకి విచ్చేశారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. తమ పాత ఇళ్లు ఉరుస్తున్నాయని, కొత్త ఇళ్లు కావాలని గిరిజనులు చెప్పారు. అలాగే తాగునీరు, కాలనీలో సిమెంటు రోడ్లు, శ్మశానానికి స్థలం కేటాయించాలని కోరారు. అంతేకాకుండా తాము సాగు చేసుకొంటున్న అటవీ భూములకు పట్టాలు మమంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామసభ నిర్వహించి కాలనీలో సమస్యలపై శాఖల వారీగా అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో తహసీల్దారు శైలాకుమారి, ఎంపీడీవో గోవర్ధన్, ఏటీడబ్ల్యూవో బేబీరాణి, ఇతర శాఖల అధికారులతో పాటు, సర్పంచ్ నాగూరయ్య, టీడీపీ నాయకులు కిషోర్‌నాయుడు, రవీంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సౌత్‌జోన్‌కు జేఎన్‌టీయూఏ క్రికెట్ జట్టు ఎంపిక


సౌత్‌జోన్‌కు ఎంపికైన జేఎన్‌టీయూఏ క్రికెట్ జట్టు

గూడూరు, అక్టోబరు 7: స్థానిక ఆదిశంకర ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం సౌత్‌జోన్ పోటీలకు జేఎన్‌టీయూఏ క్రికెట్ జట్టును ఎంపిక చేశారు. జేఎన్‌టీయూఏ స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీ జోజిరెడ్డి, క్రికెట్ టీమ్ చీఫ్ సెలక్టర్ మలిరెడ్డి కోటారెడ్డి మాట్లాడుతూ వర్సిటీ పరిధిలోని జిల్లాల నుంచి 150మందికి పైగా క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. వీరిలో ప్రతిభా ఆధారంగా 16మంది జట్టును ఎంపిక చేయడం జరిగిందన్నారు. త్వరలో చెన్నైలో జరగనున్న సౌత్‌జోన్ క్రికెట్ టోర్నమెంట్‌లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వేణుమాధవ్, ఏవో రామయ్య, పీడీ గుడ్లూరు రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.